PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 19-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 320 Issue: 320

Circulated to Telangana
Published from Jagitial

19 మే 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:46 సూర్యాస్తమయం - సా. 6:38 తిథి తదియ మ. 2:22 వరకు తరువాత చవితి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం మృగశిర ఉ. 8:41 వరకు తరువాత ఆరుద్ర యోగం ధృతి సా. 5:49 వరకు కరణం గరజి మ. 2:22 వరకు వనిజ రా. 12:42o వరకు వర్జ్యం సా. 4:13 నుండి సా. 5:39 వరకు దుర్ముహూర్తం ఉ. 8:21 నుండి ఉ. 9:12 వరకు రా. 11:05 నుండి రా. 11:50 వరకు రాహుకాలం మ. 3:25 నుండి సా. 5:02 వరకు యమగండం ఉ. 8:59 నుండి ఉ. 10:36 వరకు గుళికాకాలం మ. 12:12 నుండి మ. 1:49 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:10 నుండి తె. 4:58 వరకు అమృత ఘడియలు రా. 9:13 నుండి రా. 10:39 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# చుక్ బుక్.. బుల్లెట్ స్పీడు!

## ముంబై- అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ఫస్ట్‌లుక్ ఇదే



ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు తొలి చిత్రం బయటకొచ్చింది. ఈ రెండు నగరాల మధ్య పరుగులు పెట్టనున్న హైస్పీడ్ రైలుకు సంబంధించిన చిత్రాన్ని ఢిల్లీలోని రైల్వే శాఖ భవనం గేటు నంబర్ 4 వద్ద సోమవారం ప్రదర్శించారు. పక్షి ఆకారం నుంచి ప్రేరణ పొంది ఈ రైలును రూపొందించినట్లు తెలుస్తోంది.

న్యూఢిల్లీ: గంటకు సుమారు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా ఈ బుల్లెట్ రైలును డిజైన్ చేశారు. ఇది అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 7 గంటలకు పైగా పడుతుండగా.. బుల్లెట్ రైలులో కేవలం 2 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ప్రతిపాదిత నమూనా ప్రకారం ఇందులో 8 కోచ్‌లు ఉంటాయి. ముంబయి- అహ్మదాబాద్ కారిడార్‌లో సబర్మతి, అహ్మదాబాద్, ఆనంద్, వడోదర, భరూచ్, తరువాయి 2 వ పేజీలో...



## రోడ్లున్నవి నమాజ్ కోసం కాదు!

రాకపోకల కోసం ఉద్దేశించినవి

అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

లక్నో: రోడ్లపై నమాజ్ చేయడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. రోడ్లు అనేవి ప్రజల రాకపోకల కోసం ఉద్దేశించినవని, ప్రజా రవాణాకు అంతరాయం కలిగిస్తూ ట్రాఫిక్‌ను దిగ్బంధించే హక్కు ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. చట్టం, ప్రభుత్వ నిబంధనలు అందరికీ సమానంగా -2 వ పేజీలో...

# నేడు బీమా భేటీ

## సమావేశం కానున్న మంత్రి వర్గ ఉపసంఘం

ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల జీవితబీమా

జూన్ 2 అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత పలు కొత్త పథకాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో పథకానికి శ్రీకారం చుట్టేందుకు చర్యలు చేపట్టింది. త్వరలోనే రాష్ట్రంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేసేందుకు.. ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది బడ్జెట్ సందర్భంగా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఈ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన ప్రకటనను చేసిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): ఈ నేపథ్యంలో ఆ పథకాన్ని అమలు చేసేందుకు.. మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కానుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ చర్చించనుంది. ఈ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమాను కల్పించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పథకం అమలుకు సంబంధించి.. మంగళవారం రోజున మంత్రి వర్గ ఉపసంఘం భేటీ అయి.. చర్చించి, దానికి సంబం ధించి విధివిధానాలను -2 వ పేజీలో...



## రేవంతు మరో సువేందు!

సీఎంకు మోదీతో లింక్ ఉందేమో

కాంగ్రెస్‌లో ఉండేవాళ్లకే సీఎం పదవి ఇవ్వాల్సింది

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కామెంట్స్

ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. తెలంగాణ పర్యటన సందర్భంగా.. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తనతో కలిసి రావాలి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రధాని మోదీ సూచించగా.. అది రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే తాజాగా బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

నిజామాబాద్, మే 18 (ఈవార్తలు): ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డికి ఏదైనా స్పెషల్ లింక్ ఉందేమో అంటూ వ్యాఖ్యానించారు. అందుకే జీవితాంతం కాంగ్రెస్ పార్టీలోనే ఉండే నేతకు సీఎం పదవి ఇవ్వాల్సింది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రస్తావనను ధర్మపురి అరవింద్ తీసుకువచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో ముందు నుంచి తృణముల్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న సువేందు అధికారి.. 2021 ఎన్నికల ముందు బీజేపీలో చేరారని.. ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు. రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలోకి రావొచ్చేమో అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. అందుకే ప్రధాని మోదీ.. రేవంత్ రెడ్డిని తనతో కలిసి పనిచేయి అని అన్నారేమో అనే సందేహాలు వ్యక్తం చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీపైనే ధర్మపురి అరవింద్ విమర్శలు గుప్పించారు. ముందు నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంటి నమ్మకమైన నాయకులకు ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాల్సిందని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,791 |
| వెండి (కిలో): | రూ.3,05,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,154 |


## ట్రంప్ సరెండర్!?

ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేతకు సిద్ధం!

అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన

14 సూత్రాల ప్రతిపాదనలు తీసుకొచ్చిన టెహ్రాన్

చైనాను ఒప్పించడంలో అమెరికా అధ్యక్షుడు విఫలం



పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్ చమురుపై ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేయాలని అమెరికా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇరాన్ వార్తా సంస్థ తస్నీమ్ వెల్లడించింది. దీంతో ప్రపంచ మార్కెట్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. అంతర్జాతీయ నివేదికల ప్రకారం.. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేసే చైనా సంస్థలపై ఆంక్షలను ఎత్తివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు.

వాషింగ్టన్/టెహ్రాన్: ఆంక్షలను తొలగిస్తారనే వార్తల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు స్వల్పంగా తగ్గాయి. ఒకవేళ ఆంక్షలను ఎత్తివేస్తే.. చమురు ధరలు గణనీయంగా తగ్గుతాయని అంచనా. ఇరాన్ తరఫున చర్చల ప్రతినిధులకు సన్నిహితంగా ఉన్న ఒక మూలాన్ని ఉటంకిస్తూ.. చర్చల సందర్భంగా ఇరాన్ చమురుపై ఆంక్షలను తాత్కాలికంగా నిలిపివేయడానికి అనుమతించే నిబంధనలను వాషింగ్టన్ ముసాయిదా తరువాయి 2 వ పేజీలో...




## కాళేశ్వరం అంత్య పుష్కరాలకు 3,360 బస్సులు

21 నుంచి జూన్ 1 వరకు సరస్వతి అంత్య పుష్కరాలు

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు

వరంగల్, మే 18 (ఈవార్తలు): కాళేశ్వరంలో నిర్వహించనున్న అంత్య పుష్కరాలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 3,360 బస్సులతో 5,772 ప్రత్యేక ట్రిప్పులను నడపనున్నారు. ఈ మేరకు వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 1 వరకు గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమక్షేత్రమైన కాళేశ్వరంలో పుష్కరాలు జరుగుతున్నాయని, ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు -2 వ పేజీలో...




## మన సన్నాలకు డిమాండ్

భారీగా కొంటున్న ఏపీ, కర్ణాటక, తమిళనాడు వ్యాపారులు

కర్ణాటకలోని కొన్ని జిల్లాలకు క్రాప్ హాలిడే ప్రకటన

హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): దేశంలో అత్యధికంగా వరిని పండించే రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న తెలంగాణలో.. గత కొన్నేళ్లుగా ప్రతీ సీజన్‌లోనూ రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అవుతోంది. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. సన్నవడ్లను పండించాలని రైతులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే సన్నాలను సాగు చేస్తే.. క్వింటాల్‌కు మద్దతు ధరపైన అదనంగా మరో రూ.500 చెల్లిస్తామని చెబుతోంది. అదే సమయంలో రేషన్ బియ్యాన్ని, సంక్షేమ -2 వ పేజీలో...

## విశ్వవాణి



పసిఫిక్ మహా సముద్రంలో గత 150 ఏళ్లలో ఎన్నడూ లేనంత అత్యంత ప్రమాదకరంగా సూపర్ ఎల్‌నినో ఏర్పడుతోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని ప్రభావం అనేక దేశాలపై ఉండబోతోందని, కరువు తాండవిస్తుందని హెచ్చరిస్తున్నారు.

## భగీరథ్‌పై జీవితఖైదు సెక్షన్!

పోక్సో కేసులో కీలక పరిణామం

హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): సంచలనం సృష్టించిన పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై దర్యాప్తు అధికారులు కేసును మరింత తీవ్రతరం చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 64(2)(ఎం) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే నిందితుడికి పదేళ్లకు పైగా జైలు శిక్ష, కొన్ని సందర్భాల్లో జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉంది. ఈ నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు, కేసు నమోదు విషయంలో పోలీసులు హైడ్రామా సృష్టించారని, బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకునే క్రమంలో పోలీసులు నిజం చెప్పకుండా ఒత్తిడి చేశారన్న తరువాయి 2 వ పేజీలో...

## విచారణకు భగీరథ ఫ్రెండ్స్

రెండున్నర గంటల పాటు 10 మందిపై ప్రశ్నల వర్షం

ఫోన్ కాల్స్, వాట్సాప్ చాట్‌లు పరిశీలన.. పోక్సో కేసులో దర్యాప్తు ముమ్మరం



దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మరిన్ని ఆధారాలను సేకరించేందుకు సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం చర్లపల్లి జైలుకు తరలించారు.

హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): ఈ నేపథ్యంలోనే కేసులో కీలక విషయాలను తెలుసుకునేందుకు సిట్ అధికారులు చర్యలు చేపట్టారు. బండి భగీరథ్ పోక్సో కేసును బయటికి రాకుండా ఉండేందుకు, అతడిని కాపాడేందుకు ప్రయత్నాలు చేసినట్లు భావిస్తున్న 10 మంది ఫ్రెండ్స్‌ను సోమవారం రోజున సిట్ అధికారులు విచారణ జరిపారు. ఈ పోక్సో కేసులో బండి భగీరథ్ మాత్రమే కాకుండా.. అతడి స్నేహితుల ప్రమేయంపైనా పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. బాధిత బాలికపై అఘాయిత్యం జరిగినప్పుడు.. బండి భగీరథ్ తరువాయి 2 వ పేజీలో...

## రక్తపు రాదారి

ముంబై-అహ్మదాబాద్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

12 మంది దుర్మరణం.. 30 మందికి గాయాలు

పాల్ఘర్: మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై పెళ్లి బృందంతో వెళుతున్న ట్రక్కును కంటైనర్ బలంగా ఢీకొట్టడంతో 12 మంది మృతి చెందగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వారితో వెళుతున్న ట్రక్కును పశువులతో వెళుతున్న కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదం జరిగినప్పుడు ట్రక్కులో 100 మందికి పైగా ఉన్నట్టు -2 వ పేజీలో...

## రాశి ఫలాలు
19.5.2026

మేషం: మేషరాశి వారికి నేడు శుభ ఫలితాలు వస్తాయి. ఉద్యోగంలో పురోగతి, ఆర్థిక లాభాలు ఉంటాయి. కుటుంబంలో సంతోషం ఉంటుంది. ఆరోగ్యం మంచిది. కొత్త పనులు చేపట్టడానికి అనుకూలం.

వృషభం: వీరికి ఆర్థిక స్థిరత్వం ఉంటుంది. సూర్య-బుధ సంచారం వల్ల ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. వ్యాపారులకు లాభం. కుటుంబ సభ్యులతో గడపడం మంచిది.

మిథునం: మిథున రాశిలో చంద్రుడు మీ రాశిలో ఉండటం వల్ల మానసికంగా చురుకుగా ఉంటారు. ప్రయాణాలు, కమ్యూనికేషన్ రంగాల్లో మంచి ఫలితాలు. శుక్రుడు మార్పు వల్ల సంతోషం పెరుగుతుంది.

కర్కాటకం: శుక్రుడు మీ రాశిలోకి ప్రవేశించడం శుభం. ఆర్థిక లాభాలు, కుటుంబ సుఖం, ప్రేమ వ్యవహారాల్లో మెరుగు. ఆరోగ్యం జాగ్రత్తగా ఉంచుకోవాలి.

సింహం: సింహరాశి వారికి కేతు ప్రభావం వల్ల జాగ్రత్త అవసరం. ఆర్థిక వ్యవహారాల్లో ఆలోచనగా ముందుకు వెళ్లాలి. ఉద్యోగంలో సవాళ్లు ఎదురవచ్చు కానీ ఓపికగా ఉంటే గెలుపు మీదే.

కన్య: కన్యారాశి వారికి ఈ రోజు మంచి రోజు. స్నేహితులు, బంధువుల సహాయం లభిస్తుంది. వ్యాపార విస్తరణకు అవకాశాలు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

తుల: లగ్నాధిపతి శుక్రుడు మార్పు వల్ల తులా రాశి వారికి మంచి ఫలితాలు వస్తాయి. సామాజిక గౌరవం పెరుగుతుంది. కళా, సౌందర్య రంగాల వారికి మంచిది.

వృశ్చికం: వృశ్చిక రాశి వారికి ఆర్థిక ఇబ్బందులు తాత్కాలికంగా ఉండవచ్చు. ఖర్చులు అదుపు చేయాలి. ఆరోగ్యం, మానసిక ఒత్తిడి జాగ్రత్త. సహనం ఉంచుకోండి.

ధనుస్సు: ధనుస్సు రాశి వారికి గురువు మీ 7వ భావంలో ఉండటం వల్ల భాగ్య స్థానం బలం పొందుతుంది. దూర ప్రయాణాలు, విదేశీ సంబంధాలు అనుకూలం.

మకరం: మకరరాశి జాతకులకు శని ప్రభావం వల్ల కష్టపడి పని చేయాల్సి ఉంటుంది. ఫలితాలు ఆలస్యంగా వచ్చినా మంచివే. ఆరోగ్యం జాగ్రత్త.

కుంభం: రాహువు మీ రాశిలో ఉండటం వల్ల అనాలోచిత నిర్ణయాలు తీసుకోకండి. ఆర్థిక లాభాలు ఉంటాయి కానీ ఖర్చులు కూడా ఎక్కువ.

మీనం: శని మీ రాశిలో ఉండటం వల్ల ఓపిక అవసరం. ఉద్యోగస్థులకు బాధ్యతలు పెరుగుతాయి. ఆధ్యాత్మికత వైపు మనసు మొగ్గుతుంది.

# ట్రంప్ సరెండర్!?



మొదటి పేజీ తరువాయి

అంగీకరించిందని తెలిసింది. మునపటి ముసాయిదాలకు భిన్నంగా, సవరించిన అమెరికా ప్రతిపాదన ఉందని, చర్చలు కొనసాగుతున్నప్పుడు ఆంక్షలను తాత్కాలికంగా సడలించడానికి ఇది ఇప్పుడు అనుమతిస్తుందని పేర్కొంది. ఉద్రిక్తతలను తగ్గించేందుకు టెహ్రాన్ తన తాజా 14-సూత్రాల తీర్మానం ముసాయిదాను ముందుకు తెచ్చిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఏదైనా తుది, విస్తృత ఒప్పందంలో భాగంగా అమెరికా విధించిన అన్ని ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం తప్పనిసరిగా ఉండాలని ఇరాన్ నిరంతరం నొక్కి చెబుతోంది. ఇరాన్‌పై ఆర్థికంగా సహా అన్ని విధాలుగా ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఆ దేశ చమురు వాణిజ్యంపై అమెరికా ఆంక్షలు విధించింది. తొలి దశలో అమెరికా కంపెనీలు ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని నిషేధించారు. ఆంక్షల రెండవ దశలో ఇరాన్ పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేసే అమెరికాయేతర సంస్థలు, బ్యాంకులు, విదేశీ ప్రభుత్వాలను కూడా చేర్చారు. గతవారం రెండు రోజుల చైనా పర్యటనలో ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను ఒప్పించడంలో ట్రంప్ విఫలమయ్యారు. ఇరాన్‌కు సైనిక పరికరాలు, ఆయుధాలను సరఫరా చేయబోమని బీజింగ్ హామీ ఇచ్చింది. కానీ చమురు కొనుగోలును కొనసాగిస్తామని తెలిపింది. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నా.. శాంతి చర్చలలో ప్రతిష్టంభన నెలకుంది. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. చర్చలు విఫలమైతే సైనిక చర్య సహా ప్రత్యామ్నాయాల గురించి ట్రంప్ తన జాతీయ భద్రతా బృందం, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ సహా తన మిత్రపక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నారని నివేదికలు సూచిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఇరాన్‌పై ఆంక్షలను అమెరికా ఎత్తివేసే ఆలోచనలో ఉన్నట్టు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రోడ్లున్నవి నమాజ్ కోసం కాదు!



మొదటి పేజీ తరువాయి

వర్తిస్తాయని, ఎవరికైనా సరే ప్రత్యేక మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. కొందరు తనను ఉత్తరప్రదేశ్‌లో రోడ్లపై నమాజ్‌ల నియంత్రణ గురించి అడుగుతుంటారని ప్రస్తావిస్తూ, యూపీలో అలాంటి వాటికి తావులేదని ఆయన కుండబద్దలు కొట్టారు. మసీదులలో స్థలం సరిపోని పక్షంలో, జనాభాకు తగ్గట్టుగా షిఫ్టుల పద్ధతిలో నమాజ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఇళ్లతో పాటు ప్రార్థనా స్థలాలలో స్థలాభావం ఉంటే, దానికి తగ్గట్టుగా నియంత్రించుకోవాలే తప్ప రోడ్లను ఆక్రమించడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ఆయన తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో కూడా పంచుకున్నారు. ఈ అంశం కేవలం ఉత్తరప్రదేశ్‌కే పరిమితం కాకుండా... పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లోనూ వేడి పుట్టిస్తోంది. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇవే వ్యాఖ్యలను పునరావృతం చేశారు. అక్కడ మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం రోడ్లపై నమాజ్‌లను అనుమతించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. అయితే, యోగి ఆరోపణలను టీఎంసీ వర్గాలు పూర్తిగా తోసిపుచ్చాయి. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే యోగి ఆదిత్యనాథ్ మైనారిటీలను బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది.

## చుక్ బుక్.. బుల్లెట్ స్పీడు!

మొదటి పేజీ తరువాయి

సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్, థానే, ముంబై.. ఇలా మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. తొలి దశలో సూరత్, బిలిమోరా మధ్య మొదటి 100 కిలోమీటర్ల విభాగాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 15న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## రక్తపు రాదారి

మొదటి పేజీ తరువాయి

తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో పదుల సంఖ్యలో గాయపడటంతో పెద్ద ఎత్తున అంబులెన్సులను మోహరించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

## నేడు బీమా భేటీ

మొదటి పేజీ తరువాయి

ఖరారు చేయనున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం లేదా విపత్తు జరిగి కుటుంబాన్ని నడిపించే.. యజమాని చనిపోతే.. ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడకుండా ఉండేందుకు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. ఈ పథకానికి అర్హుల ఎంపికకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, నిబంధనలను ఖరారు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కేబినెట్ సబ్ కమిటీని నియమించగా.. తాజాగా మంత్రుల బృందం సమావేశమై చర్చించనున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభించాలని.. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సందర్భంగా తెలిపింది. ఆ గడువు దగ్గరికి వస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కేబినెట్ సబ్ కమిటీ భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఈ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద రూ.5 లక్షల జీవిత బీమాను తెలంగాణలోని 1.15 కోట్ల కుటుంబాలకు వర్తింపజేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ధనిక, పేద అనే తేడా లేకుండా తెలంగాణలోని ప్రతీ ఒక్క కుటుంబానికి ఈ బీమా పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు.

# రేవంతు మరో సువేందు!

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. ఇక ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2034 వరకు తానే సీఎంగా ఉంటానని.. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తన లక్ష్యమని చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ధర్మపురి అరవింద్.. 2039 వరకు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కాలేరని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డే ప్రకటించారని ఎద్దేవా చేశారు. అంటే ఇంకో 10 ఏళ్ల పాటు దేశంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఒప్పుకున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం.. నిజామాబాద్ జిల్లాను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాకు పూర్తిగా పంగనామాలు పెట్టారని మండిపడ్డారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా తొక్కిపెట్టేందుకే.. సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లాకు నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. జిల్లాకు నిధులను తీసుకురావడంలో మహేష్ కుమార్ గౌడ్ విఫలం అయ్యారని.. ఆయన ఏ మొహం పెట్టుకుని నిజామాబాద్ జిల్లాలో తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) ఇస్తామని హామీ ఇచ్చి.. మరిచిపోయారని విమర్శించారు. ఇందూరు జిల్లా ప్రజలను మోసం చేస్తే.. తగిన బుద్ధి చెప్తారని మండిపడ్డారు. దేవుళ్లకు ఇచ్చిన హామీలనే నెరవేర్చకుండా మోసం చేసిన రేవంత్ రెడ్డికి.. ప్రజలను మోసం చేయడం లెక్క కాదని ఆరోపించారు.

# మన సన్నాలకు డిమాండ్

హాస్టల్‌లలో విద్యార్థులకు సన్న బియ్యాన్నే అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో సన్నాల సాగు విపరీతంగా పెరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఇతర రాష్ట్రాల వ్యాపారులు.. తెలంగాణలోకి వచ్చి సన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటం గమనార్హం. దీంతో ప్రస్తుతం తెలంగాణలో యాసంగి సీజన్‌లో పండిన సన్నవడ్లకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాలకు బాగా డిమాండ్ ఉంది. గద్వాల జిల్లా, నారాయణపేట, నిజామాబాద్ జిల్లాలోని బోధన్ నియోజకవర్గంలో పండిన సన్న వడ్లను కర్ణాటక వ్యాపారులు భారీ మొత్తంలో కొనుగోలు చేస్తుండటం విశేషం. కర్ణాటకకు పొరుగున ఉన్న వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలోని 33 గేట్లకు ప్రస్తుతం మరమ్మతు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కర్ణాటకలోని రాయచూరు, బళ్లారి, కొప్పళ వంటి జిల్లాల్లో ఈసారికి క్రాప్ హాలిడే ప్రకటిస్తూ.. అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పుడు తెలంగాణలో పండిన సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో బెంగళూరు నగరంలో ప్రజలు తినే సన్న బియ్యంలో ఎక్కువ భాగం.. ఈ జిల్లాల నుంచే వెళ్లేదని.. ఇప్పుడు అక్కడ క్రాప్ హాలిడే ప్రకటించడంతో.. మన సన్న వడ్లకు గిరాకీ పెరిగిందని.. పౌరసరఫరాల సంస్థ అధికారి ఒకరు వెల్లడించారు. కర్ణాటకలోని కొన్ని జిల్లాలకు ప్రస్తుతం తెలంగాణలో యాసంగి సన్న వడ్లు భారీగా వెళుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక తెలంగాణలో వరి కోతలు ముందుగా ప్రారంభం అయ్యే బోధన్ నియోజకవర్గం నుంచి దాదాపు 2 లక్షల టన్నుల సన్న వడ్లను ఇప్పటికే.. కర్ణాటక, మహారాష్ట్ర వ్యాపారులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని వ్యాపారులు, రైస్ మిల్లర్లు కూడా తెలంగాణ రైతుల నుంచి సన్నవడ్లను భారీగా కొంటున్నారు. సరిహద్దు జిల్లాలైన నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి ఏపీతోపాటు.. తమిళనాడు వ్యాపారులు కూడా మధ్యవర్తుల ద్వారా భారీ ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఇక మిర్యాలగూడలో ఉండే రైస్ మిల్లర్లు కూడా రైతుల నుంచి సన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

## కాళేశ్వరం అంత్య పుష్కరాలకు 3,360 బస్సులు

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక రవాణా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 5,772 ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. రీజియన్‌లోని హన్మకొండ, వరంగల్ 1, వరంగల్ 2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ డిపోల నుంచి కాళేశ్వరానికి 59 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. హన్మకొండ బస్టాండ్ నుంచి మరిన్ని ప్రత్యేక బస్సులు ఉంటాయని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను పెంచుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనంగా వసూలు చేస్తామని అన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని అన్నారు.

# విచారణకు భగీరథ ఫ్రెండ్స్

మొదటి పేజీ తరువాయి

ఫ్రెండ్స్ కూడా అక్కడే ఉన్నారని.. ఈ ఘటన తర్వాత దాన్ని బయటికి రాకుండా చేసేందుకు వారు తీవ్ర ప్రయత్నాలు చేశారని బాధితురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడంతో.. వారిని విచారణ చేశారు. ఈ ఘటన మొత్తాన్ని బయటికి రాకుండా రాజీ కుదిర్చాలని ప్రయత్నించారని.. ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసేందుకు తీవ్రంగా యత్నించారని బాధితురాలి తల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే బండి భగీరథ్‌తో సంబంధం ఉన్న 10 మంది ఫ్రెండ్స్ పేర్లను కూడా బాధితురాలి తల్లి పోలీసులకు అందించారు. ఈ నేపథ్యంలోనే బాధితురాలి తల్లి ఇచ్చిన పేర్ల ఆధారంగా సిట్ చీఫ్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని పోలీస్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఆమె ఇచ్చిన వివరాల ఆధారంగా 10 మంది బండి భగీరథ్ ఫ్రెండ్స్‌ను ఇవాళ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. వారి నుంచి విషయాలను రాబట్టేందుకు విచారణ జరిపారు. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో.. బండి భగీరథ్ ఫ్రెండ్స్‌ను సిట్ అధికారులు పలు కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఆ సంఘటన జరిగిన రోజు అసలు ఏం జరిగింది.. ఆ సమయంలో బాధితురాలు ఏం చెప్పింది.. దానికి బండి భగీరథ్ ఎలా స్పందించాడు.. ఈ విషయంలో రాజీ చేయాలని ఎవరెవరు ఒత్తిడి తీసుకువచ్చారు.. అనే కోణంలో ప్రశ్నలు వేసి.. బండి భగీరథ్ స్నేహితుల నుంచి సమాధానాలను రాబట్టారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా వారి స్టేట్‌మెంట్‌ను అధికారికంగా రికార్డ్ చేశారు. ఈ క్రమంలోనే వారి సెల్ ఫోన్లలో ఉన్న కాల్‌డేటాతో పాటు వాట్సాప్ చాటింగ్ హిస్టరీలను కూడా సిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ 10 మంది ఇచ్చిన వివరాల ఆధారంగా.. ఈ కేసులో మరింత మందిపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# భగీరథ్‌పై జీవితఖైదు సెక్షన్!



మొదటి పేజీ తరువాయి

విమర్శలు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ఈ కేసుకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే రంగంలోకి దిగిన డీసీపీ రితిరాజ్, సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు ఫైళ్లను పరిశీలించారు. పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంలో స్పష్టత లేదని గుర్తించి, దర్యాప్తును లోతుగా చేపట్టారు. మంగళవారం డీసీపీ స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి, ఆమెతో స్నేహపూర్వక వాతావరణంలో మాట్లాడారు. పోక్సో కేసుల దర్యాప్తు నిబంధనల ప్రకారం, ఆమె నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. బాధితురాలు చెప్పిన విషయాలకు, పోలీసులు మొదట నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేదని గ్రహించారు. బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి జరిగిందని ఆమె వాంగ్మూలం ద్వారా తెలియడంతో ఇది అత్యంత తీవ్రమైన నేరమని డీసీపీ నిర్ధారించుకున్నారు. బాధితురాలి ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6 పరిధిలోకి వస్తాయని గుర్తించారు. దీనికి సమానమైన బీఎన్ఎస్ సెక్షన్ 64(2)(ఎం)ను కేసులో చేర్చాలని ఆదేశించారు. ఈ సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే నిందితుడికి కనిష్ఠంగా 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంటుంది.



# తెలంగాణలో చమురు కొరత లేదు: ఓఎంసీలు

హైదరాబాద్, మే 18 (పీఐబీ): రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలో ఓఎంసీల రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెల్లడించారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయటం లేదు. తెలంగాణలో ఈ నెలలో నిన్నటి వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశామనీ, ఈ సీజన్‌కు ఇది సాధారణమని ఓఎంసీలు తెలిపాయి. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ విధానమైన డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) వ్యవస్థను అనుసరించాలని కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం డీఏసీ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. రాష్ట్రంలో డీఏసీ అమలు శాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ఓఎంసీలు, గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి. నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని.. విశ్వసనీయ సంస్థలు అందించే వార్తలను మాత్రమే విశ్వసించాలని సామాన్య ప్రజలకు ఓఎంసీలు మరోసారి విజ్ఞప్తి చేశాయి.

## అప్పిచ్చినోళ్లనే లేపేయాలని చూశాడు!

**8 మంది వద్ద అప్పులు... అందులో ఇద్దరి హత్య**

**రంగారెడ్డి జిల్లాలో దారుణం!**

మొయినాబాద్, మే 18 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. తమకు అప్పు ఇచ్చిన వారిని చంపేసిన దారుణ సంఘటన వెలుగు చూసింది. జిల్లాలోని మొయినాబాద్ లో జంట హత్యలు జరిగాయి. ఈ కేసు విచారణలో పోలీసులకు విస్తుగొలిపే విషయాలు తెలిశాయి. కరీమా బేగం దంపతులు, మరో వ్యక్తి తమకు అప్పు ఇచ్చిన 8 మందిని చంపేందుకు ప్లాన్ చేశారు. అందులో ఇద్దరు మహిళలను చంపేశారు. మరో ఆరుగురిని కూడా హత్య చేసేందుకు ఫామ్‌హౌస్‌కు పిలిచారు. కానీ వారు రాకపోవడంతో ప్రాణాలు దక్కాయి. ఇద్దరు మహిళల హత్య ఘటన వెలుగు చూసిన తర్వాత తమకూ ప్రాణహానీ ఉందంటూ ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన అబేదాబేగం, మహబూబాబీ... అదే కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. డబ్బు తిరిగి ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని తొల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకువెళ్ళి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తర్వాత అబేదా బేగంను కూడా అదేవిధంగా హత్య చేశారు. మిగిలిన ఆరుగురు మహిళలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు తవ్వకాలు చేపట్టారు. మొదట మహబూబాబీ అస్తిపంజరం బయటపడింది. ఆ తర్వాత అబేదాబేగం మృతదేహం కూడా బయటపడింది. అనంతరం నిందితులను విచారించగా, అప్పు ఇచ్చిన ఆరుగురిని కూడా చంపేందుకు కూడా ప్లాన్ చేసినట్లు ఒప్పుకున్నారు.

## రౌడీషీటర్లతో రోడ్డుపై పరేడ్

**వరంగల్ పోలీసుల కీలక చర్య**

వరంగల్, మే 18 (ఈవార్తలు): తెలంగాణలోని వరంగల్ జిల్లా కేంద్రంలో పోలీసులు రౌడీ షీటర్ల ఆట కట్టిస్తున్నారు. రౌడీ షీటర్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు రౌడీషీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. ఆ రౌడీ షీటర్లను ఖిల్లా వరంగల్ తహసీల్దారు కార్యాలయం వరకు రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకుపోయారు. అనంతరం తహసీల్దారు సమక్షంలో వారిని బైండోవర్ చేశారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం మొత్తం 764 మంది రౌడీ షీటర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ఈస్ట్ జోన్ పరిధిలో 275, వెస్ట్ జోన్ పరిధిలో 158, సెంట్రల్ జోన్ పరిధిలో 331 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు గుర్తించారు. రౌడీ షీటర్ల ప్రవర్తనను బట్టి పోలీసులు వారిని మూడు విభాగాలుగా విభజించారు. ఎవరిపై ఎలా నిఘా ఉంచాలో పక్కా ప్లాన్ సిద్ధం చేశారు. అయితే ఇటీవలి కాలంలో రౌడీషీటర్ల వేధింపులు ఎక్కువ కావడంతో పోలీసులు వారందరినీ పిలిపించి ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండుటెండలో రోడ్డుపై కవాతు చేయించారు. రౌడీషీటర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేశారు.

## లోకేశ్ కాదు.. లవ్ క్యాష్

**ఆయనకు డబ్బంటేనే ప్రేమ.. వైసీపీ నేత అంబటి సెటైర్లు**

గుంటూరు, మే 18 (ఈవార్తలు): ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు.. ఏపీ మంత్రి నారా లోకేష్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. లోకేష్ కు 'లవ్ క్యాష్' అనే కొత్త పేరు పెడుతున్నట్లు ప్రకటించి, ఆయన డబ్బును అమితంగా ప్రేమిస్తారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పెరిగిన ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ.. "ఆయన పేరు లోకేష్ కాదు, లవ్ క్యాష్. ఎందుకంటే ఆయన డబ్బును ప్రేమిస్తారు" అని అన్నారు. లోకేశ్ చిన్నప్పుడు అన్నప్రాశన సమయంలో బంగారం, పుస్తకాలు వంటివి కాకుండా డబ్బునే పట్టుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని లోకేష్ మేనమామ అయిన నందమూరి హరికృష్ణ తనకు స్వయంగా చెప్పారని అంబటి గుర్తుచేశారు. చిన్నప్పటి నుంచే లోకేష్ కు డబ్బుపై ప్రేమ ఎక్కువని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ఇంధన ధరలు దేశంలోనే అత్యధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని కోరుతూ వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా గుంటూరులో జరిగిన కార్యక్రమంలో అంబటి పాల్గొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్ రిజైన్ చేశారా?

**భగీరథ్ కేసులో బీఆర్ఎస్ దుష్ప్రచారం.. బండి సంజయ్‌కి బీజేపీ చీఫ్ మద్దతు**



హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. తక్షణమే రాజీనామా చేయాలని.. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అదే సమయంలో కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. అదే సమయంలో బీజేపీపైనా బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఇవన్నీ విమర్శలకు తాజాగా బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు.. కౌంటర్ ఇచ్చారు. బండి భగీరథ్ కేసులో బండి సంజయ్ తప్పేమీ లేదని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీపై తీవ్ర అసత్య ప్రచారం జరుగుతోందని రాంచందర్‌రావు మండిపడ్డారు. ఒక వ్యక్తిని, అతడి కుటుంబాన్ని టార్గెట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీపై, బండి సంజయ్.. బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని విరుచుకుపడ్డారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి.. రాష్ట్రం మొత్తం పోస్టర్లు వేయించారని ఆరోపించారు. బండి సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని.. ఆయనపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోదని తేల్చి చెప్పారు. ఇక బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఏదైనా తప్పు చేస్తే.. న్యాయపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బండి సంజయ్‌పై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఇక గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మహిళలపై నేరాల శాతం 67 శాతం పెరిగిందని గుర్తు చేసిన రాంచందర్ రావు.. జూబ్లీహిల్స్ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన కేసులో కేసీఆర్ గానీ, కేటీఆర్ గానీ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్తే.. రాజీనామా చేశారా అని నిలదీశారు. ఇక తనను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళా సర్పంచి ఫిర్యాదు చేస్తే.. ఆ పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కేటీఆర్‌కు నైతిక విలువలు లేవని.. వారి ఇంట్లో ఆడబిడ్డ తప్పు చేస్తే ఎందుకు రాజీనామా చేయలేదని ఈ సందర్భంగా రాంచందర్ రావు నిలదీశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం రాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ఫార్ములా ఈ-కార్ రేస్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసిపోయాయి కాబట్టే కేటీఆర్, కేసీఆర్‌లను అరెస్ట్ చేయడం లేదని విమర్శించారు.

# తెలంగాణ నక్సల్ ఫ్రీ

**పోలీసులకు అమిత్ షా కితాబు**

**ఛత్తీస్‌గఢ్‌లో డీజీపీ, తదితరులకు సన్మానం**



జగ్‌ధల్‌పూర్: రాబోయే ఐదేళ్లలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపురేఖలు మార్చడం తమ తదుపరి లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. నిర్దేశిత లక్ష్యం 2026 మార్చి 31లోగా దేశంలో మావోయిస్టులను నిర్మూలించడంలో కృషి చేసిన పోలీసులు, భద్రతా బలగాలను సోమవారం జగదల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. దీంతోపాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన సేవా కేంద్రాలను నేతనార్ గ్రామంలో అమిత్ షా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. తమ దగ్గర అభివృద్ధి జరగకపోవడం వల్లే ఆయుధాలు చేపట్టామనే తప్పుడు ప్రచారం చేస్తూ మావోయిస్టులు బస్తర్ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఇటీవల మూడు వేల మంది మావోయిస్టులు లొంగిపోతే, అందులో రెండు వేల మందికి కనీసం రాయడం, చదవడం రాదని, ఈ ప్రాంతానికి మావోయిస్టులు చేసిన అన్యాయాలకు ఇదో ఉదాహరణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేసిన కృషితో ఈ ప్రాంతం నుంచి మావోయిస్టులను నిర్మూలించామని పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సూచనలతో బస్తర్‌లో గుజరాత్ తరహాలో పాడి పరిశ్రమ అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందని అమిత్ షా చెప్పారు. ఇకపై వచ్చే ఉద్యోగాల భర్తీ ప్రకటనల్లో 15 శాతం ఉద్యోగాలను బస్తర్ ఆదివాసీల కోసం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులను నిర్మూలించేందుకు 2018 నుంచి విస్తృత ప్రయత్నాలు జరిగాయని అమిత్‌షా అన్నారు. ఢిల్లీలో పెద్ద పెద్ద భవనాల్లో కూర్చుని కాగితాలు, కంప్యూటర్ల మీద ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడానికి 2026 మార్చి 31వ తేదీని గడువుగా పెట్టుకున్నామని అమిత్ షా గుర్తుచేశారు. పై స్థాయిలో ఎన్ని ప్లాన్లు వేసినా వాటి క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేస్తారనేది కీలకమని, ఆ విషయంలో వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, పారా మిలిటరీ బలగాలు, స్పెషల్ ఫోర్సులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేశాయని కితాబునిచ్చారు. ఆ ఆపరేషన్‌లో పాల్గొన్న బలగాలకు ఆయన అభినందనలు తెలిపారు. బస్తర్‌లో మావోయిస్టుల ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఆ పార్టీకి దిశానిర్దేశం చేసే నేతల్లో ఎక్కువ మంది తెలంగాణకు చెందిన వారున్నారు. దీంతో నిర్దేశిత గడువులోగా మావోయిస్టులను నిర్మూలించడంలో తెలంగాణ పోలీస్ అధికారులు కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో జగదల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి (మాజీ డీజీపీ), తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, మల్కాజ్‌గిరి సీపీ బి.సుమతి (ఎస్ఐబీ మాజీ చీఫ్), డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్, గ్రేహౌండ్స్) అనిల్ కుమార్‌ను అమిత్‌షా సత్కరించారు. మావోయిస్టు కార్యకలాపాల నిరోధానికి శివధర్‌రెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్, హోంమంత్రి విజయ్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్క్ చెట్ల నరికివేతపై సుప్రీం స్టే

**కొత్త ఫ్లైఓవర్ పనులకు బ్రేక్**

హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) జాతీయ పార్క్ పరిరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. పార్క్ చుట్టూ ఉన్న ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఫ్లైఓవర్ల నిర్మాణాల కోసం భారీగా సాగుతున్న చెట్ల నరికివేతపై సర్వోన్నత న్యాయస్థానం మధ్యంతర స్టే విధించింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ జరిగే వరకు కేబీఆర్ జాతీయ పార్క్ పరిసరాల్లోని 25 నుండి 35 మీటర్ల పరిధిలోని ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఎలాంటి చెట్లను నరకడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులతో జీహెచ్ఎంసీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్లైఓవర్ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించారు. హైదరాబాద్ నగరానికి ఊపిరితిత్తుల్లాంటి కేబీఆర్ పార్క్ చుట్టూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణాల కోసం దాదాపు 1,300 చెట్లను నరికే ప్రణాళిక ఉందా? లేక చెట్లను నరకకుండానే పనులు కొనసాగిస్తున్నారా? అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. న్యాయవాది వివేక్ రెడ్డి స్పందిస్తూ..చెట్లను నరకకుండా పనులు జరగడం లేదని అన్నారు. ఇప్పటికే వందలాది చెట్లను కొట్టేశారని... ప్రస్తుతం రోజుకు 50 చొప్పున రాత్రింబగళ్లు చెట్లను నరుకుతున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఎకో సెన్సిటివ్ జోన్‌లో చెట్లను నరకవద్దని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ ఉత్తర్వులు ఎక్కడా రద్దు కాలేదని.. కానీ, ప్రస్తుతం హైకోర్టుకు వేసవి సెలవులు ఉండటాన్ని రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఆసరాగా చేసుకుంటున్నారన్నారు. గతంలో ఈ పర్యావరణ జోన్ పరిధి 25 మీటర్లుగా ఉంటే.. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే దాన్ని ఏకపక్షంగా కేవలం 3 మీటర్లకు కుదించేశారన్నారు. ఈ వెసులుబాటును వాడుకుంటూ అడ్డగోలుగా చెట్లను నరికేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. తక్షణమే ఈ వ్యవహారంపై స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. అప్పటివరకు కేబీఆర్ నేషనల్ పార్క్ పరిధిలోని 25 నుంచి 35 మీటర్ల ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఒక్క చెట్టును కూడా నరకడానికి వీల్లేదని మధ్యంతర స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## తొర్రూర్ లో గజం రూ.45,500

**బహదూర్ పల్లిలో చదరపు గజం రూ. 40,500**

**రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన**

**సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం**

హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ తో ఫ్యూచర్ సిటీకి, అవుటర్ రింగ్ రోడ్ కు సమీపంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని తొర్రూర్ (66 ప్లాట్లు), కుర్మల్ గుడ (11), బహదూర్ పల్లి (8) ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 85 ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నాడు బహిరంగ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్ పేట లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బహిరంగ వేలంలో పాల్గొన్నబిడ్డర్లు చదరపు గజానికి నిర్దేశించిన దానికంటే అధిక మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేయడం విశేషం. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి గౌతం తెలిపారు. తొర్రూల్ లే అవుట్ లో ప్లాట్ ను కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీలు పడుతూ గరిష్టంగా చదరపు గజం స్థలాన్ని రూ.45,500 (నలభైఐదు వేల అయిదు వందలు)కు వేలం పాటలో కొనుగోలు చేశారని ఎండి శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటి క్యారిడార్ కు సమీపంలో ఉన్న తొర్రూర్ లో 200 -700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు (జూశ్రీశం) చదరపు గజానికి కనీస ధర 25 వేల రూపాయలుగా నిర్ధారించగా, సగటున రూ. 32,500 (ముప్పయి రెండు వేల అయిదు వందలు) ధర పలికిందన్నారు. తమకు నచ్చిన భూముల కోసం పోటీ పడుతూ బిడ్డర్లు ఒక దశలో ప్లాట్ ను దక్కించుకోడానికి దాదాపు ఇరవైసార్లు రేట్లు పెంచారంటే ఇక్కడి భూములకున్న డిమాండ్ అర్ధంచేసుకోవచ్చు. అదే విధంగా ఎయిర్ పోర్టు, ఆర్సీఐకి దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ లో 200 నుంచి 400 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్లకు చదరపు గజం కనీస ధర 20 వేల రూపాయలుగా నిర్ణయించగా, గరిష్టంగా రూ.27,500 ధర పలికింది. అవుటర్ రింగ్ రోడ్ ను ఆనుకుని ఉన్న బహదూర్ పల్లి ప్రాంతంలో 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్లకు కూడా మంచి ధర పలికింది. ఇక్కడ చదరపు గజం కనీస ధర 27 వేల రూపాయలుగా నిర్ణయించగా, వేలం పాటలో గరిష్టంగా రూ.40,500 (నలభైవేలు ఐదు వందల) రూపాయల ధర పలికింది. వేలం పాటలో సగటున ఈ భూములకు గజం రూ.33,800కు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ బహిరంగ వేలం విక్రయాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## టీఆర్ఎస్ జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

**నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'జెండా పండుగ'**

హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలను రాష్ట్రవ్యాప్తంగా ఏకరూపంలో నిర్మించనుంది. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఈ మోడల్‌ను సోమవారం ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ స్టేట్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో కవిత జెండా గద్దె మోడల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉండగా, పైభాగం రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని వివరించారు. పార్టీ నిర్ణయించిన కచ్చితమైన కలర్ కోడ్స్‌ను పాటించి జెండా గద్దెలు తయారు చేయాలని కవిత పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఇలా చేస్తే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జెండాలు ఏకరూపంలో ఉంటాయని తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు ఒక నెల పాటు రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కవిత ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జనరల్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

**డిజైన్ వివరాలు:**

**గద్దె బేస్‌కు గ్రీన్ కలర్.. పైభాగం యెల్లో కలర్**

పై భాగం మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్‌లో ఏర్పాటు
తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో 'టీఆర్ఎస్' రాయాలి
గ్రీన్ బేస్ మధ్యలో తెలుగులో 'తెలంగాణ రక్షణ సేన' అని రాయాలి

## హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు


హైదరాబాద్, మే 18 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యల కేసులో నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో దామోదర్ అనే వ్యక్తి హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అసలేం జరిగిందంటే.. పోక్సో కేసులో కీలక నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ ముందస్తు బెయిల్‌పై హైకోర్టు వాదనలు జరుగుతున్నప్పుడు సోషల్ మీడియా అనుచిత పోస్టుపై నమోదైన కేసు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ముమ్మరం చేశారు. ఆయా పోస్టులు చేసిన వారిని గుర్తించడం కోసం ఐపీ అడ్రస్లు కోరుతూ ఆదివారం సర్వీస్ ప్రొవైడర్లకు మెయిల్స్ పంపారు. హైకోర్టు రిజిస్ట్రార్ ఇచ్చిన ఫిర్యాదుతో చార్మినార్ పోలీసు స్టేషన్లో నమోదైన ఈ కేసు దర్యాప్తు నిమిత్తం సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాకు బదిలీ అయింది. బండి సాయి భగీరథ్‌ను రక్షించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని, అతను ఒక మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడని, పోలీసులు, ప్రధాన మీడియా, సోషల్ మీడియాను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని పోస్టులు వచ్చాయి. సీనియర్ వెకేషన్ జడ్జి జస్టిస్ టంగిరాల మాధవి దేవిని కూడా ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారని కేసులో ఆరోపించారు. పాక్సో కేసులో భగీరథకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, జస్టిస్ టంగిరాల మాధవి దేవి భర్తను తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నియమించేలా చూస్తానని కొందరు చెప్పినట్లు పోస్టులు చేశారు. ఈ కల్పిత వార్తను సోషల్ మీడియాలో ఉంచడమే కాకుండా ప్రింట్ మీడియాలో కూడా ప్రచురించారని, దీని వల్ల అది విస్తృతంగా ప్రచారం చెంది, న్యాయమూర్తులు. న్యాయవాదులు, సాధారణ ప్రజలు చదవడం ద్వారా న్యాయ వ్యవస్థ ప్రతిష్టకు భంగం కలుగుతోందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.




# కేరళ సీఎంగా సతీశన్ ప్రమాణం

**రేవంత్ సహా పలు రాష్ట్రాల సీఎంలు హాజరు**

తిరువనంతపురం: కేరళ నూతన ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో గవర్నర్ అర్లేకర్ ఆయనచేత ప్రమాణస్వీకారం చేయించారు. సతీశన్‌తో పాటుగా 20 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బీజేపీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ తదితరలు హాజరయ్యారు. ఆహ్వానం ఉన్నా.. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీతో జత కట్టినా.. సీఎం విజయ్ మాత్రం ప్రమాణస్వీకారోత్సవానికి హాజరు కాలేదు. విజయ్‌కు కేరళలో విపరీతమైన మాస్ ఫాలోయింగ్ ఉంది. గతంలో ఆయన కేరళలో పర్యటించిన ప్రతిసారీ వేలాది మంది అభిమానులు రోడ్లపైకి రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇప్పటికే ఈ ప్రమాణ స్వీకారానికి దేశవ్యాప్తంగా పలువురు వీఐపీలు, వేలాది మంది ప్రజలు వస్తుండటంతో.. విజయ్ కూడా వస్తే రద్దీ మరింత పెరిగి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని భద్రతా అధికారులు నివేదిక ఇచ్చారు. పరిపాలనాపరమైన బిజీ షెడ్యూల్స్, భద్రతా కారణాల దృష్ట్యా విజయ్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.






## మోదీకి నార్వే అత్యున్నత పురస్కారం

ఒస్లో: నార్వే అత్యున్నత పౌర పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేయిన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను ప్రధాని మోదీ అందుకున్నారు. మొదటిసారి తమ దేశానికి వచ్చిన భారత ప్రధాని మోదీని సోమవారం నార్వే కింగ్ హెరాల్డ్-5 దేశ అత్యున్నత పురస్కారంతో సత్కరించారు. నార్వే, మానవాళి శ్రేయస్సు కోసం విశిష్ట సేవలు అందించిన విదేశీయులు, నార్వే పౌరులకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రధాని మోదీకి ఇది 32వ అంతర్జాతీయ పురస్కారం. ఐదు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం ప్రధాని మోదీ నార్వేలోని ఒస్లోలో అడుగుపెట్టారు. భారత ప్రధానికి నార్వే ప్రధాని జోనాస్ గాహ్ స్టోర్ సాదర స్వాగతం పలికారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో భారత్‌కు అండగా నిలబడ్డ నార్వేకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## అమ్మ క్యాంటీన్లను ఆధునీకరించండి

**అధికారులకు తమిళనాడు సీఎం విజయ్ ఆదేశాలు**



చెన్నై: తమిళనాడు నూతన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కీలక నిర్ణయాలను తీసుకుంటూ ముందుకెళు_న్నారు. ప్రమాణస్వీకారం రోజునే మహిళలకు ఉచిత బస్సు, పేదలకు ఉచిత విద్యుత్ వంటి పథకాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. అలాగే, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ సిబ్బందితో సమానంగా డీఏ పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. తాజాగా, తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే అధినేత్రి ఏర్పాటుచేసిన అమ్మ క్యాంటీన్ల ఆధునీకరణకు విజయ్ ఆదేశించారు. పేదలకు నామమాత్రపు ధరకు రుచికరమైన, సుచికరమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో జయలలిత వీటిని ప్రారంభించారు. ఈ క్యాంటీన్లే కర్ణాటకలో ఇందిర క్యాంటీన్లు, ఆంధ్రప్రదేశ్‌లో అన్నా క్యాంటీన్లకు రోల్ మోడల్.ఎంకే స్టాలిన్ నాయకత్వంలోని గత డీఎంకే ప్రభుత్వం కూడా వీటిని కొనసాగించింది. ప్రస్తుత సీఎం విజయ్ సైతం అమ్మ క్యాంటీన్ల మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, మెరుగుపరచాలని, ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మరిన్ని పాత్రలు, సామగ్రి కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది.

## కొత్తవారి నుంచి ఎక్కువ ఆశించొద్దు

**విజయ్ పాలనపై కమల్ హాసన్ వ్యాఖ్యలు**

చెన్నై: తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పరిపాలనపై ఇప్పుడే ఒక అంచనాకు రాలేమని ఎంఎన్ఎం అధినేత, రాజ్యసభ ఎంపీ కమల హాసన్ అన్నారు. దానికి కనీసం ఆరు నెలల సమయం ఇవ్వాలని పేర్కొన్నారు. రెండు రోజులు లేదా పదిహేను రోజుల్లోనే ఒకరి పరిపాలనను అంచనా వేయడం కేవలం జ్యోతిష్యానికే సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. ఆదివారం (మే 17) మదురై ఎయిర్‌పోర్టులో విలేకరులతో మాట్లాడిన కమల్ హాసన్.. రాజకీయాల్లోకి కొత్తవారు రావడం కొత్తేమీ కాదన్నారు. స్వతంత్ర భారతదేశం ఏర్పడినప్పుడు అప్పటి ప్రభుత్వంలో ఉన్న మంత్రులందరూ రాజకీయాలకు కొత్తవారేనని ఆయన గుర్తుచేశారు. అందువల్ల రాజకీయాల్లోకి కొత్తగా వచ్చే వారిని మనం తక్కువ అంచనా వేయకూడదని అన్నారు. అదే సమయంలో వారి నుండి అతిగా ఏమీ ఆశించకూడదని చెప్పారు. ప్రజలు ఓట్లేసి గెలిపించారు కాబట్టి ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో నిశితంగా గమనించాలని తాము కూడా నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఇక ద్రవిడ పార్టీలు (ఐవీఖ, ౼ాxూణవీఖ) కాకుండా తమిళనాడులో ఏర్పాటైన నూతన ప్రభుత్వం గురించి మీడియా ప్రశ్నించగా కమల్ హాసన్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు.

## ప్రైవేటు ఉద్యోగులకు 2 రోజుల వర్క్‌ఫ్రం హోమ్

**ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యలు మొదలయ్యాయి. కేంద్రమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఇంధనాన్ని పొదుపు చేస్తున్నారు. ఢిల్లీ ప్రభుత్వం కూడా ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలకు కీలక సూచనలు చేసింది. ఇకపై వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అవలంభించాలని సూచించింది. అలాగే ఆఫీసులు పనిచేసే వేళల్లో మార్పులు చేయాలని, ఉద్యోగులు కార్‌పూలింగ్, ప్రజా రవాణాను వినియోగించుకునేలా చూడాలన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీ, పారిశుద్ధ్యం, విద్యుత్, ఆరోగ్య సంస్థలు వంటి అత్యవసర విభాగాలకు సంబంధించి సేవలు అందించే ప్రైవేట్ సంస్థలకు మినహాయింపు ఇచ్చారు. ఢిల్లీలో ప్రతిరోజూ ప్రైవేట్ ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లి వచ్చేందుకు బైకులు, కార్లు ఉపయోగిస్తున్నారు.. ఈ కారణంగా రోజువారీగా అధిక మొత్తంలో ఇంధన వినియోగం అవుతుంది. అందుకే వారంలో రెండు రోజుల పాటూ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేయాలని సూచించింది.

# మతపరమైన పథకాలు రద్దు

**బెంగాల్ సీఎం మరో సంచలన నిర్ణయం.. పూజారులు, ఇమామ్‌లకు భారీ షాక్**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో మతపరమైన పథకాలను రద్దుచేయాలని సోమవారం జరిగిన పశ్చిమ బెంగాల్ క్యాబినెట్ సమావేశంలో తీర్మానించారు. ఇది జూన్ నుంచి ఆమల్లోకి రానుంది. అలాగే, కలకత్తా హైకోర్టు ఆదేశాలతో రాష్ట్రంలో ఇతర వెనుకబడి వర్గాల జాబితాను రద్దు చేశారు. బెంగాల్ సీఎం నిర్ణయంతో ఆలయాల్లో పూజారులు, మసీదుల్లోని ఇమామ్‌లకు నెల నెల ఇచ్చే గౌరవేతనం ఇకపై నిలిచిపోనుంది. మమతా బెనర్జీ అధికారంలో ఉన్నప్పుడు ఈ పథకాలను తీసుకొచ్చారు. దీని కింద నెలకు రూ.1,000 ఆర్థిక సాయం అందజేసేవారు. ఎన్నికలకు ముందు దీనిని రూ.2,000కు పెంచారు. అయితే, మహిళలకు ఆర్థిక సాయం, ఉచిత బస్సు పథకాలను కొనసాగించాలని నిర్ణయించారు. క్యాబినెట్ సమావేశం అనంతరం సీఎం సువేందు అధికారి మీడియాతో మాట్లాడుతూ.. తమ నిర్ణయాన్ని సమర్థించారు. ఈ నిధులను ఇప్పుడు అన్ని వర్గాల, రాజకీయ నేపథ్యాల విద్యార్థులకు అందుబాటులో ఉండే ప్రతిభ ఆధారిత స్కాలర్‌షిప్‌లకు మళ్లిస్తామని ఆయన అన్నారు. "ప్రభుత్వం ఇమామ్‌లకు, మత పెద్దలకు భృతి చెల్లించడంపై దృష్టి పెట్టాలా? లేక విద్యపై దృష్టి పెట్టాలా? అనేది బేరీజువేసుకుని ఈ రోజు క్యాబినెట్‌లో అన్ని మతపరమైన పథకాలను రద్దు చేసింది" అని అధికారి అన్నారు. "ఈ పథకాల ద్వారా వచ్చే డబ్బు ఇప్పుడు వివేకానంద మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌కు వెళ్తుంది. హిందువు, ముస్లిం, సిక్కు, జైనుడు, బీజేపీ మద్దతుదారుడు, టీఎంసీ మద్దతుదారుడు లేదా సీపీఎం మద్దతుదారుడు అనే తేడా లేకుండా ఏ విద్యార్థి అయినా దీనిని పొందవచ్చు. ఇందులో ఎటువంటి బుజ్జగింపు ఉండదు" అని ఆయన పేర్కొన్నారు. మదర్సా సమాచార, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న మత ఆధారిత సహాయ పథకాలను దశలవారీగా నిలిపివేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అగ్నిమిత్ర పాల్ తెలిపారు. ఈ పథకాలు ఈ నెలాఖరు వరకు కొనసాగి, ఆ తర్వాత అధికారికంగా రద్దువుతాయని చెప్పారు.

# 'ఉగ్రవాద నిరోధక చట్టం' కేసులోనూ బెయిల్

**సుప్రీంకోర్టు సంచలన తీర్పు**



న్యూఢిల్లీ: ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ) కింద నమోదైన కేసుల్లోనూ 'బెయిల్ అనేది ఒక రూల్' అని సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పునిచ్చింది. దిల్లీ అల్లర్ల కేసులో జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్‌కు గతంలో బెయిల్ నిరాకరిస్తూ ఇచ్చిన సొంత ఉత్తర్వులపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఖాలిద్‌కు బెయిల్ నిరాకరించిన గత ధర్మాసనం.. సుదీర్ఘకాలం జైల్లో ఉండటానికి సంబంధించిన పాత తీర్పులను, నిబంధనలను సరిగ్గా పాటించలేదని స్పష్టం చేసింది. జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పులకు చిన్న బెంచ్‌లు కట్టుబడి ఉండాలని, వాటిని మార్చడం లేదా విస్మరించడం చేయొద్దని కోర్టు స్పష్టం చేసింది. గత జనవరిలో ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ నిరాకరించిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం అనుసరించిన విధానాన్ని అంగీకరించలేమని పేర్కొంది. విచారణలో తీవ్ర ఆలస్యం జరుగుతున్నప్పుడు.. కఠినమైన యూఏపీఏ చట్టం కింద కూడా నిందితుడికి బెయిల్ పొందే హక్కు ఉంటుందని కోర్టు పేర్కొంది. ప్రాథమిక విచారణలోనే కేసు నిజమని తేలితే.. విచారణ ఎన్ని ఏళ్లు సాగినా బెయిల్ ఇవ్వకూడదనే వాదనను సుప్రీంకోర్టు పూర్తిగా తోసిపుచ్చింది. ఇలాంటి పద్ధతిని అంగీకరిస్తే.. విచారణ పూర్తి కాకుండానే నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని పేర్కొంది. ఆరు సంవత్సరాలుగా కస్టడీలో ఉన్న సయ్యద్ ఇఫ్తికార్ అనే నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఈ తాజా ఆదేశాలు ఇచ్చింది.

# ఆదుకున్న ఐటీ షేర్లు




ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. రోజులో చాలా వరకు నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు, చివరి గంటలో ఐటీ షేర్లలో వచ్చిన బలమైన కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద, నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడ్డాయి. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఐటీ రంగం స్టార్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు రక్షణాత్మక రంగాలైన ఫార్మా, హెల్త్‌కేర్ వైపు మొగ్గుచూపారు. దీంతో ఆ రంగాల షేర్లలో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే, బ్రాడర్ మార్కెట్‌లో మాత్రం అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.15 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.26 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలపై వాటి ప్రభావం వంటి అంశాలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 23,700 వద్ద తక్షణ నిరోధం ఉందని, 23,300 వద్ద బలమైన మద్దతు ఉందని తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితి తగ్గే వరకు మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగవచ్చని, కాబట్టి రిస్క్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు.

# రష్యా చమురు కొనుగోళ్లలో తగ్గం

**అమెరికా ఆంక్షలున్నా వెనక్కి తగ్గం: కేంద్రం**



న్యూఢిల్లీ: అమెరికా ఆంక్షలు ఉన్నా లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్ళు కొనసాగుతాయని భారత్ స్పష్టం చేసింది. దేశీయ ఇంధన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా ముడి చమురు దిగుమతులు ఉంటాయని తెలిపింది. రష్యా పెట్రోలియం ఉత్పత్తులపై అమెరికా ఆంక్షల మినహాయింపు గడువు ముగిసిన నేపథ్యంలో కేంద్రం దీనిపై స్పందించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు కూడా భారత్ అక్కడి నుంచి కొనుగోలు చేసిందని తెలిపారు. ఆంక్షలను సడలించినప్పుడూ మాస్కో నుంచి చమురు దిగుమతి చేసుకున్నామని అన్నారు. ఇప్పుడు కూడా ఆ కొనుగోళ్ళు కొనసాగుతాయని తెలిపారు. చమురు ఏ దేశం నుంచి కొనాలనేది పూర్తిగా మన వాణిజ్య ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. అందువల్ల అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా లేకపోయినా మనకు ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. దేశంలో చమురు కొరత లేదని తెలిపారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, రష్యా చమురు కొనుగోలు చేసేందుకు భారత్ సహా ప్రపంచ దేశాలకు అనుమతిస్తూ అమెరికా ఆంక్షలు సడలించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే సముద్రంలో ఉన్న రష్యా చమురు నౌకల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్ళు జరపాలని గతంలో తెలిపింది. ఆ గడువు మే 17తో ముగిసిన నేపథ్యంలో దేశంలో చమురు కొరతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో, కేంద్రం స్పందించింది.

## అనుమానంతో భార్య ప్రైవేట్ పార్ట్స్‌పై యాసిడ్

పుణె: అనుమానం పెనుభూతమై ఓ వ్యక్తి తన భార్యపై అత్యంత అమానుషంగా దాడికి దిగాడు. కొడుకు పుట్టలేదనే కోపంతో, పరాయి పురుషుడితో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో ఆమె జననాంగాలపై యాసిడ్ పోసి హింసించాడు. ఆపై 15 రోజుల పాటు ఇంట్లోనే బంధించి కనీసం వైద్యం కూడా అందకుండా చేసిన భయంకర ఘటన పుణెలో వెలుగుచూసింది. ఏప్రిల్ 20న జరిగిన ఈ ఘోరం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. "బయటకు వెళ్లినప్పుడు ఎవరితో తిరుగుతున్నావు?" అంటూ ఆమెను దారుణంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా టాయిలెట్ క్లీనింగ్ యాసిడ్ తీసుకొచ్చి ఆమె ప్రైవేట్ పార్ట్స్‌పై పోశాడు. బాధితురాలు నొప్పితో కేకలు వేస్తూ పారిపోవాలని చూసినా తలుపులు లాక్ చేసి మరీ కొట్టాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని నిందితుడు భార్యను బెదిరించాడు. తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను 15 రోజుల పాటు ఇంట్లోనే నిర్బంధించాడు. మే 9న భర్త పనికి వెళ్లిన సమయంలో ఆమె తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని పుట్టింటికి పారిపోయింది. తల్లిదండ్రులకు జరిగిన దారుణాన్ని వివరించింది. వారు పోలీసులను ఆశ్రయించారు. మే 15న కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను చికిత్స కోసం పుణెలోని ఆసుపత్రికి తరలించారు.

## ఖర్చులు తగ్గించుకోండి

**ప్రభుత్వ బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం ఆదేశాలు**

న్యూఢిల్లీ: ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలకు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతో పాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వంటి దిగ్గజ సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి. కేంద్ర ఆర్థిక సేవల విభాగం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం.. అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలి. సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితి పాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొంది. వీటితో పాటు, ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది.

## చైనాలో 5.2 తీవ్రతతో భూకంపం

గ్వాంగ్జీ: చైనాలోని గ్వాంగ్జీలో రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. లియుజౌ నగరంలో 7,000 మందికి పైగా నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భూకంప ప్రభావిత నైరుతి ప్రాంతంలో గాలింపు, సహాయక చర్యలు ముగిశాయి. భూకంపం నేపథ్యంలో రవాణాకు అంతరాయం కలుగుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులను ఉటంకిస్తూ ప్రభుత్వ మీడియా జిన్హువా తెలిపిన వివరాల ప్రకారం, శిథిలాల కింద చిక్కుకున్న 91 ఏళ్ళ వృద్ధుడిని అధికారులు కాపాడారు. ఇద్దరు మృతి చెందినట్లు జిన్హువా తెలిపింది. మృతులు 63 ఏళ్ళ పురుషుడు, 53 ఏళ్ళ మహిళ ఉన్నారు. వీరు దంపతులని అధికారులు తెలిపారు. గల్లంతైన వారి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.

# సంజయ్ కమర్షియల్ కరప్టెడ్ లీడర్

**కేవీ స్థలంపై రాజకీయ అడ్డంకులు**

జగిత్యాల, మే 18 (ఈవార్తలు): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పొలిటికల్ ఎథిక్స్ లేని కమర్షియల్ కరప్టెడ్ లీడర్ అంటూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ధ్వజమెత్తారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ ఆఫీసులో నిర్వహించిన మీడియా సమావేశంలో కేవీ స్థల అంశంపై ఎంపీ ఘాటుగా స్పందించారు. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అనువైన స్థలం ఎంపిక విషయంలో ఎమ్మెల్యే కావాలనే రాజకీయ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేవీ ఏర్పాటుకు ఐదు నుంచి పది ఎకరాల స్థలం అవసరమని కేంద్ర నిబంధనలు స్పష్టంగా చెబుతున్నప్పటికీ రెండు ఎకరాలే కేటాయించారని అరవింద్ మండిపడ్డారు. ఇది తిరస్కరణకు గురవుతుందని తెలిసే ఆ ప్రతిపాదన పంపించారని ఆరోపించారు. "కేవీ కోసం సరైన కనెక్టివిటీ, యాక్సెసిబిలిటీ ఉండాలి. పిల్లలు, తల్లిదండ్రులు సౌకర్యంగా చేరుకునే ప్రాంతంలోనే పాఠశాల ఉండాలి" అంటూ స్పష్టం చేశారు. రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేని ఐటీఐ సమీప ప్రాంతంలో కేవీ ఏర్పాటు చేయాలన్న ప్రయత్నాలపై ఎంపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "అకాడమిక్ ఇయర్ ఆలస్యమైనా పరవాలేదు.. కానీ మంచి ప్రాంతంలోనే కేంద్రీయ విద్యాలయం నిర్మించి తీరుతాం" అని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత ఈగో కారణంగా పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పైసల కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్ ని రాజకీయంగా నగ్నంగా చేసే వరకు వదిలిపెట్టం.. స్కామ్‌లు ఒక్కొక్కటిగా బయట పెడతాం అంటూ హెచ్చరికలు జారీ చేశారు. బిజెపి కార్యక్రమానికి అనుమతి నిరాకరించడం పై పోలీసుల తీరును తప్పుబట్టిన ఎంపి ఐఏఎస్, ఐపీఎస్ లు చదివి రాజకీయ పార్టీలకు కొమ్ము కాయడం సరికాదన్నారు. మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, బిజెపి రాష్ట్ర నాయకురాలు భోగ శ్రావణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనుప్ రావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చెరువులు ఆక్రమిస్తుంటే ఏం చేస్తున్నరు?

**ఆక్రమణలపై జీవన్‌రెడ్డి మండిపాటు.. నిరసన దీక్ష**

జగిత్యాల , మే 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో చెరువులు, నీటి వనరుల ఆక్రమణలను నిరసిస్తూ మాజీ మంత్రి టీ . జీవన్ రెడ్డి , బీఆర్ఎస్ నాయకురాలు దావత్ వసంత సురేందర్ రెడ్డి సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. చెరువుల్లో మట్టి నింపుతూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి వనరులకు సంబంధించిన ఒర్రెలు, చెరువు శిఖంల భూములు పెద్దఎత్తున ఆక్రమణలకు గురవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నాటి స్థితిని ప్రామాణికంగా తీసుకుని సమగ్ర సర్వే నిర్వహించి చెరువుల అసలు హద్దులను నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. చెరువులను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన జీవన్‌రెడ్డి, ప్రజల నీటి హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చెరువులను ఆక్రమణల నుంచి వెంటనే విముక్తి చేయాలని, లేకపోతే ప్రజా ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు చేపట్టిన మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని చెరువుల పునరుద్ధరణకు విశేష కృషి జరిగిందని, ప్రస్తుతం ఆ లక్ష్యాలు నీరుగారుతున్నాయని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ చెరువులు గ్రామీణ జీవనాధారమని, భూగర్భ జలాల పరిరక్షణకు అవి కీలకమని పేర్కొన్నారు. ప్రజల నీటి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి:ఎస్పీ

జగిత్యాల బ్యూరో, మే 18 (ఈవార్తలు): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పలు ఫిర్యాదులను పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై న్యాయపరంగా, పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. చట్ట పరిధిలోకి వచ్చే సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, విచారణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులను స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన స్పందిస్తున్నామని పేర్కొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్త!



ధర్మపురి, మే 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామంలో జగిత్యాల జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటీపీలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా ఫ్రెండ్‌షిప్‌లు, ఆన్‌లైన్ లోన్లు, ఫేక్ జాబ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. యువతలో డ్రగ్స్ మరియు చెడు అలవాట్ల ప్రభావం వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన చర్యలపై పోలీస్ కళాబృందం పాటలు, ప్రదర్శనల ద్వారా సందేశాలు అందించింది. అదేవిధంగా రాత్రి వేళల్లో దొంగతనాల నివారణ, అపరిచితుల పట్ల అప్రమత్తత, మహిళలు మరియు విద్యార్థులు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరంపై ప్రజలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

**గంగాధర ఎక్స్ రోడ్డులో బీఆర్ఎస్ మహాధర్నా**



గంగాధర, మే 18 (ఈవార్తలు): కరీంనగర్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు మహాధర్నా నిర్వహించాయి. కరీంనగర్--జగిత్యాల ప్రధాన రహదారిపై మధురనగర్ చౌరస్తాలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నిస్తూ బండి సంజయ్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని, కేసుపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు. ధర్నా కారణంగా కొంతసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



## మహిళా సంఘాల పేరుతో మోసాలు!

**ఒక్కో గ్రూప్ నుంచి రూ.5 వేలు వసూలు?**

జగిత్యాల టౌన్, మే 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో మహిళా సంఘాలు, శ్రీనిధి గ్రూపులకు చెందిన మహిళలను కమిషన్ పేరుతో మోసం చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆర్పీలు, కొందరు మధ్యవర్తులు కలిసి ఒక్కో గ్రూప్ నుంచి రూ.5 వేల వరకు వసూలు చేశారని బాధిత మహిళలు ఆరోపించారు. జిల్లాలో వందలాది గ్రూపుల నుంచి ఈ విధంగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాస్య మహిళల సంతకాలను తీసుకుని వారి పేర్లపై రుణాలు తీసుకున్నారని, అనంతరం రుణాలకు సంబంధించిన నోటీసులు రావడంతో అసలు విషయం తెలిసిందని మహిళలు తెలిపారు. తాము ఎలాంటి రుణాలు తీసుకోకపోయినా అప్పులు తమపై మోపారని వాపోయారు. ఈ వ్యవహారంపై గత నాలుగేళ్లుగా అధికారులకు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించి న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు డిమాండ్ చేస్తున్నారు.



## సర్దార్ సత్రం కనిపించడం లేదు!

**వెతికి పెట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదు**

జగిత్యాల, మే 18 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ నడిబొడ్డున ఉన్న చారిత్రక 'సర్దార్ సత్రం' అకస్మాత్తుగా కనుమరుగైందని జనసేన పార్టీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంతో మందికి ఆశ్రయం ఇచ్చిన ఈ ప్రజల ఆస్తి ఎలా మాయమైందో అధికారులు, పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 'కొత్త బస్టాండు నుండి టవర్ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో, టవర్ సర్కిల్‌కు అతి సమీపంలో ఈ సత్రం ఉండేది. అనేక గదులతో నిర్మితమైన ఈ సర్దార్ సత్రం, ఎన్నో ఏళ్లుగా పట్టణ ప్రజలకు, పరిసర ప్రాంతాల వారికి, అలాగే ఎందరో బాటసారులకు (ముసాఫిర్లకు) నీడగా, ఆశ్రయంగా నిలిచింది. కొన్ని సంవత్సరాల పాటు ఈ సత్రం దేవాదాయ శాఖ (ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్) పరిధిలో ఉండేదని, దీని పర్యవేక్షణకు ఒక కార్యనిర్వహణ అధికారి కూడా విధులు నిర్వర్తించిన దాఖలాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ ప్రదేశంలో సత్రం కనిపించడం లేదు' అని ఫిర్యాదు చేశారు. సత్రాన్ని ఎవరు దొంగిలించారు లేదా ఆక్రమించారు? ఎండోమెంట్ పరిధిలో ఉన్న ఆస్తి ఎలా మాయమైపోయింది? ఈ ప్రశ్నలకు జగిత్యాల పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజల పక్షాన పాలకులు, అధికారులు తక్షణమే వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో జగిత్యాల నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి బెక్కం జనార్ధన్, జగిత్యాల రూరల్ మండల అధ్యక్షుడు బొల్లి రాము, సారంగాపూర్ మండలం పీఓసీ సభ్యుడు బెక్కం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



## ఆరోగ్యానికి క్రీడలు

**5కే మారథాన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్**

జగిత్యాల టౌన్, మే 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా 5కే మారథాన్‌ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని స్వామి వివేకానంద స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ మారథాన్‌లో యువత, విద్యార్థులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం యువత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## తైక్వాండోలో కోరుట్ల సోదరుల సత్తా

కోరుట్ల, మే 18 (ఈవార్తలు): జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 16వ జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన అన్నదమ్ములు ఎం .డి . ఖాజా శుభనుద్దీన్ , ఎం .డి . ఖాజా ఆశీరుద్దీన్ కాంస్య పతకాలు సాధించి ప్రతిభ చాటారు. మే 15 నుంచి 17 వరకు నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో ఎం.డి ఖాజా సుభానుద్దీన్ అండర్-68 కేజీల విభాగంలో, అతని సోదరుడు ఎం.డి ఖాజా ఆశీరుద్దీన్ అండర్-29 కేజీల విభాగంలో విజయం సాధించారు. దేశంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులతో పోటీ పడుతూ పతకాలు గెలుచుకోవడం విశేషంగా నిలిచింది. గతంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించిన ఈ సోదరులు, ఇప్పుడు జాతీయ స్థాయిలో పతకాలు సాధించి కోరుట్ల ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అరుదైన ఘనతగా స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాభిమానులు వారిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



## కిషోర బాలికల ఆరోగ్య శిబిరం ప్రారంభం

జగిత్యాల టౌన్, మే 18 (ఈవార్తలు): ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఖిల్లాగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కో-ఆప్షన్ సభ్యురాలు టాస్లీమ్ సుల్తానా ముజీబుద్దీన్ హాజరయ్యారు. మే 18 నుంచి 23 వరకు ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుంచి నిర్వహించే ఈ శిబిరంలో బాలికలకు రక్తహీనత, మధుమేహం పరీక్షలు, దీవీ× టెస్ట్‌లు నిర్వహించనున్నారు. అలాగే మెన్స్ట్రువల్ హైజీన్‌పై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు. ఈ శిబిరాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.




## వీడీసీ భవనానికి స్థలం కేటాయించాలి

**నిర్మాణ అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి**

బుగ్గారం, మే 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)కి పక్కా భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణ అనుమతులు కూడా జారీ చేయాలని విడిసి ప్రతినిధులు కోరారు. సోమవారం నిర్వహించిన అత్యవసర పాలకవర్గ సమావేశంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శికి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. గ్రామ నడిబొడ్డున నిర్మాణ దశలో ఉన్న ఎంపీపీ కార్యాలయం పక్కన ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ పార్కింగ్‌కు వినియోగిస్తున్న స్థలాన్ని విడిసి భవన నిర్మాణానికి కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. విడిసి వ్యవస్థాపక అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు సుంకం ప్రశాంత్‌లు గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ, పంచాయతీ కార్యదర్శి అక్బర్‌తో పాటు ఉపసర్పంచ్ జంగ లావణ్య, వార్డు సభ్యులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ అంశంపై పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసి, గ్రామసభలోనూ ఆమోదం తెలుపుతూ తీర్మాన ప్రతులతో పాటు భవన నిర్మాణ అనుమతులు జారీ చేయాలని కోరారు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines - Rs.450
(for each extra line - Rs.90)

COLOUR:
Price for 5 Lines - Rs.500
(for each extra line - Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com

వయ్యారి చిత్రం





## కంటెంట్ ఉన్న నటుడు..

కమెడియన్ నుండి విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా టాలీవుడ్ నటుడు సునీల్ ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఒకప్పుడు కేవలం నవ్వులు పూయించిన ఆయన, ఇప్పుడు పాన్ ఇండియా చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్నారు. మలయాళ చిత్రం 'కట్టలన్'లో ఆయన నటిస్తున్న 'మారి' పాత్ర ఈ ప్రయాణంలో మరో మైలురాయి. తెలుగు చిత్రసీమలో సునీల్ పేరు వినపడగానే ఒకప్పుడు థియేటర్లలో నవ్వుల జల్లులు కురిసేవి. స్వయంకృషితో పరిశ్రమలోకి అడుగుపెట్టి, స్టార్ కమెడియన్‌గా ఎదిగిన సునీల్, ఆ తర్వాత హీరోగా మారి మెప్పించారు. ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్‌లో విలన్‌గా, పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సరికొత్త రికార్డులు సృష్టిస్తూ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తొలినాళ్లలో చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన సునీల్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వచ్చిన చిత్రాలతో స్టార్ కమెడియన్‌గా మారారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'మన్మథుడు', 'మల్లీశ్వరి', 'సొంతం' వంటి చిత్రాలలో ఆయన పండించిన హాస్యం సార్వకాలికమైనది. కేవలం డైలాగ్స్ మాత్రమే కాకుండా, తన బాడీ లాంగ్వేజ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. కమెడియన్‌గా పీక్‌లో ఉన్న సమయంలోనే రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'మర్యాద రామన్న' చిత్రంతో సునీల్ హీరోగా మారారు. ఈ సినిమా భారీ విజయాన్ని సాధించడమే కాకుండా, నటుడిగా ఆయనలోని సరికొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఆ తర్వాత 'పూల రంగడు', 'తడాఖా' వంటి చిత్రాలతో కమర్షియల్ హీరోగానూ తన సత్తా చాటారు. హీరో పాత్రల కోసం ఆయన చేసిన మేకోవర్, సిక్స్ ప్యాక్ సాధించిన తీరు పరిశ్రమలో పెద్ద సంచలనం సృష్టించింది. హీరోగా గ్రాఫ్ తగ్గుతున్న సమయంలో సునీల్ మళ్లీ కామెడీ వైపు వెళ్లకుండా, విలన్ పాత్రలను ఎంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. 'కలర్ ఫొటో' చిత్రంలో క్రూరమైన పోలీస్ ఆఫీసర్‌గా ఆయన చూపించిన నటన అందరినీ భయపెట్టింది. ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప: ది రైజ్' చిత్రంలో 'మంగళం శ్రీను' పాత్రతో సునీల్ బీభత్సం సృష్టించారు. క్రూరత్వం, గంభీరత్వం కలబోసిన ఆ పాత్ర ఆయనను పాన్ ఇండియా నటుడిగా మార్చింది. తమిళ చిత్రం 'జైలర్'లోనూ ఆయన చేసిన పాత్ర విశేష ఆదరణ పొందింది. ప్రస్తుతం సునీల్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాకుండా కోలీవుడ్, మాలీవుడ్ పరిశ్రమలలోనూ బిజీగా మారారు. తాజాగా మలయాళ స్టార్ ఆంటోనీ వర్గీస్ హీరోగా నటిస్తున్న 'కట్టలన్' చిత్రంలో సునీల్ 'మారి' అనే శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు.

## నేడు రాత్రి 11.52కు
# డ్రాగన్ గ్లింప్స్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న పేరు) నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల సుదీర్ఘ నిడివితో ఈ గ్లింప్స్ ఉండబోతుండటం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. 'డ్రాగన్' రాత్రి 11:52 గంటలకు ఈ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఎంపిక చేసిన కొన్ని థియేటర్లలో కూడా ఈ వీడియోను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ఈ భారీ గ్లింప్స్‌కు సెన్సార్ బోర్డు నుంచి యూ/ఏ 16 ప్లస్ రేటింగ్‌తో ధ్రువీకరణ పత్రం కూడా లభించింది. "విధ్వంసం మరో రేంజ్‌లో ఉంటుంది" అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ అంచనాలను మరింత పెంచేసింది. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి భారీ




చిత్రాల తర్వాత ఎన్టీఆర్ నుంచి వస్తున్న సినిమా కావడం, 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రశాంత్ నీల్ దర్శకుడు కావడంతో 'డ్రాగన్'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటివరకు ఫస్ట్ లుక్ కూడా విడుదల కాకపోవడంతో నిరాశలో ఉన్న అభిమానుల ఆకలి తీర్చేలా ఈ భారీ గ్లింప్స్ ఉండబోతోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## మెగా ఫ్యాన్స్‌కు ఫీస్ట్.. పెద్ది!



ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ సెంటర్‌లో పెద్ది లాంచింగ్ ఈవెంట్ ను ఏర్పాటు చేసి ట్రైలర్ ను విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రైలర్ వైరల్ గా మారి అందరినీ ఆకట్టుకుంటోంది. ట్రైన్ సీన్ తో ట్రైలర్ స్టార్ట్ అవ్వగా.. ఆపండి ఎమర్జెన్సీ అంటూ చెబుతారు. ఇక్కడ ఏ కుర్రాడికైనా ఫేవరెట్ గేమ్ మారుతుంది కానీ.. ఫేవరెట్ ప్లేయర్ మారడం లేదు..పెద్ది ఏ ఏరియాలో ఏమైనా దేవుడి పేరా డైలాగ్ రాగా.. అంటూ చరణ్ క్రికెటర్ గా ఎంట్రీ ఇస్తార్న్ను. ఆ తర్వాత రెజ్లర్ గా కనిపించారు. ఆటే నా పొగరు అంటూ చరణ్ చెప్పిన డైలాగ్ అదిరిపోయింది. ఆకాశం నుంచి చుక్కలు పడతాయంటారుగా అని చరణ్ చెబుతుంటే.. జాన్వీ కపూర్ జీప్ పై ఎంట్రీ ఇచ్చారు. ఊర మాస్ లుక్ లో డైలాగ్స్ చెబుతూ ఆకట్టుకుంటున్నారు. నాకు ఆట గెలవడం కాదు.. బతకడం కావాలంటూ శివరాజ్ కుమార్ ను పరిచయం చేశారు మేకర్స్. ఆ తర్వాత మిగతా పాత్రలు రివీల్ చేయగా.. పవర్ ఫుల్ ఫైట్ సీక్వెన్స్ తో చరణ్ అదరగొట్టారు. మాటలతో కాదు.. ఆటతోనే.. అంటూ ఛాలెంజ్ విసరడం హైలెట్ గా నిలిచింది. మీరందరూ ఆడానుకుంటున్నారు.. కానీ పోరాడాను సర్ అంటూ చెప్పిన డైలాగ్ ఎమోషనల్ గా ఉంది. చివర్లో క్రికెట్ షాట్, రెజ్లర్ ఫీట్స్ ఓ రేంజ్ లో ఉన్నాయి. ఓవరాల్ గా చరణ్.. తన పాత్రలో ఒదిగిపోయారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. తన యాక్టింగ్ తో దుమ్మురేపారు. జాన్వీ కపూర్ తన లుక్స్ తోపాటు డైలాగ్ టైమింగ్ తో మెప్పించారు. మిగతా క్యాస్టింగ్ కూడా తమదైన యాక్టింగ్ తో అట్రాక్ట్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తోపాటు యాక్షన్ సీన్లు ఆకట్టుకుంటున్నారు. ఎడిటింగ్, విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ చాలా రిచ్ గా ఉన్నాయి.


### 3 గంటల రన్ టైం

సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ చిత్రాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్నారు. అయితే 'పెద్ది' విషయంలో దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతో భారీ నిడివిని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం దాదాపు 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) రన్‌టైమ్‌తో సెన్సార్ పూర్తి చేసుకుందని సమాచారం. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివితో వస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. సినిమాలోని భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్, కథలోని తీవ్రత ప్రేక్షకులను మొత్తం ప్రయాణంలో కట్టిపడేస్తాయని చిత్ర బృందం ధీమాగా ఉంది.

## పెళ్లి చేసుకొని బాధపడలేను

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'పతి పత్నీ ఔర్ వో దో' ఇటీవల మే 15న విడుదలై, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. నేటితరం ప్రేమకథలు, ఆధునిక వైవాహిక బంధాల్లో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలను ఈ సినిమాలో ఎంతో ఆసక్తికరంగా చూపించడంతో ప్రేక్షకులకు ఇది బాగా కనెక్ట్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సారా అలీ ఖాన్ పెళ్లి బంధంపై తనకున్న ప్రాక్టికల్ ఆలోచనలను, తన వ్యక్తిగత అభిప్రాయాలను ఎంతో ఓపెన్‌గా పంచుకున్నారు. తన వ్యక్తిగత జీవితంలో, చుట్టుపక్కల కొన్ని పెళ్లి బంధాలు విఫలమై విడిపోవడాన్ని కళ్లారా చూసిన సారా, వివాహం అనే వ్యవస్థను కేవలం ఊహల్లో చూసి తేలిపోనని స్పష్టం చేశారు. మనం పెరిగిన వాతావరణం, మన చుట్టూ చూసే సంఘటనల నుంచే మన ఆలోచనలు పుడతాయని పేర్కొంటూ, హడావుడిగా పెళ్లి చేసుకుని బాధపడే కంటే కాస్త సమయం తీసుకుని సరైన వ్యక్తి దొరికే వరకు వేచి చూడటం ఎంతో ఉత్తమమని ఆమె అభిప్రాయపడ్డారు. ఒకవేళ తన జీవితంలోకి సరైన భాగస్వామి దొరకకపోతే, ఎవరికోసం తనను తాను మార్చుకోకుండా జీవితాంతం ఒంటరిగా ఉండటానికైనా సిద్ధమేనని సారా తెగేసి చెప్పారు. తనకంటూ ఉన్న ప్రత్యేక గుర్తింపును గౌరవిస్తూ, తన సంతోషాన్ని పంచుకునే వ్యక్తి దొరికినప్పుడే పెళ్లి గురించి ఆలోచిస్తానని చెబుతూ, ప్రస్తుతానికి మాత్రం తన పూర్తి దృష్టి కేవలం కెరీర్, సొంత ఎదుగుదల, సినిమాలపైనే ఉందని ఆమె క్లారిటీ ఇచ్చారు.





## స్కూల్ కోసం సల్మాన్ 15 కోట్ల విరాళం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తన మంచి మనసును మరోసారి చాటుకున్నారు. ఇప్పటికే ఆయన 'బీయింగ్ హ్యూమన్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా సల్మాన్ ఖాన్ ఒక స్కూల్‌కు ఏకంగా 15 కోట్ల రూపాయల విరాళం అందించినట్లు సమాచారం. ఈ నిధులతో ఆ స్కూల్‌లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. స్కూల్ అభివృద్ధికి ఇంత భారీగా విరాళం అందించిన సల్మాన్ ఖాన్‌కు ఆ స్కూల్ విద్యార్థులు తమ చేతులతో తయారు చేసిన ప్రత్యేక గిఫ్ట్‌ను బహుకరించారు. కోట్లాది రూపాయల బహుమతులను పెద్దగా పట్టించుకోని సల్మాన్ చిన్నారులు ప్రేమతో ఇచ్చిన ఆ బహుమతిని ఎంతో ఆప్యాయంగా స్వీకరించి ఆనందించారు. అలాగే తమ కృతజ్ఞతలను వ్యక్తం చేసిన విద్యార్థులను చూసి ఆయన భావోద్వేగానికి లోనైనట్లు సమాచారం.

## పెద్దికి పర్సంటేజీ ఇవ్వాల్సిందే: ఎగ్జిబిటర్లు

టాలీవుడ్‌లో పర్సంటెంజీ వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఇటీవల తెలుగు సినిమా పరిశ్రమకు చెందిన ప్రముఖులు సమావేశమై సమస్యను పరిష్కరించుకోనున్నట్లు తెలిపారు. కానీ రామ్ చరణ్ హీరోగా వచ్చే నెలలో విడుదల కానున్న 'పెద్ది' సినిమాకు సింగిల్ థియేటర్లలో పర్సంటేజీ విధానం కావాల్సిందేనని ఎగ్జిబిటర్లు పట్టుబడుతున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మరోసారి అత్యవసరంగా సమావేశమయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ చర్యల్లో ఎటువంటి ఏకాభిప్రాయం రాలేదు. వారి మధ్య సయోధ్య కుదరలేదు. పెద్ది సినిమాకు తమకు కచ్చితంగా పర్సంటేజ్ కావాలని ఎగ్జిబిటర్లు పట్టుబడుతున్నారు. పర్సంటేజ్ కొద్దిగా తక్కువగా ఇచ్చినా పర్వాలేదని, కానీ రెంట్ మాత్రమే ఇస్తామంటే కుదరదని స్పష్టం చేశారు.







# తలా.. టాటా!?

## ఐపీఎల్‌కు ధోనీ వీడ్కోలు?

## అభిమానులకు గుడ్‌బై

## ధోనీ.. ధోనీ.. హోరెత్తిన స్టేడియం

**ఎంఎస్ ధోనీ.. ఈ పేరు వినగానే కోట్లాది క్రికెట్ అభిమానుల గుండెల్లో ఒక ప్రత్యేకమైన భావోద్వేగం ఉప్పొంగుతుంది. రెండు దశాబ్దాల పాటు భారత క్రికెట్‌కే కాదు, ఐపీఎల్ చరిత్రకూ తనదైన ముద్ర వేసిన మహేంద్ర సింగ్ ధోని ఇప్పుడు మౌనంగా వీడ్కోలు పలికిన క్షణం అభిమానులను కలచివేసింది.**

చెన్నైకి ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్‌గా చరిత్రలో నిలిచిపోయిన ధోని, సోమవారం చెన్నై చెపాక్ స్టేడియంలో అభిమానులకు భావోద్వేగ వీడ్కోలు ఇచ్చాడు. ఈ సీజన్‌లో స్వదేశ గడ్డపై ఇదే చివరి మ్యాచ్ కావడంతో, జట్టు ప్రత్యేకంగా ధోనికి ఫేర్‌వెల్ ఏర్పాట్లు చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ధోని తుది జట్టులో లేకపోయినా, అభిమానుల కోసం స్టేడియంలోకి అడుగుపెట్టిన ఆ క్షణం చెపాక్ మొత్తం ఒక్కసారిగా మార్మోగిపోయింది. "ధోని.. ధోని.." అంటూ అభిమానుల అరుపులతో మైదానం కంపించింది. తన ఐకానిక్ జెర్సీ నెంబర్ 7తో మైదానంలోకి వచ్చిన ధోని ముఖంలో చిరునవ్వు ఉన్నా, కళ్లలో భావోద్వేగం స్పష్టంగా కనిపించింది. తొలి ఇన్నింగ్స్ అనంతరం జట్టుతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన ధోని, ఆటగాళ్లతో కాసేపు ముచ్చటించాడు. అనంతరం అభిమానుల వైపు తిరిగి ఒకసారి చేతులూపాడు. అదే క్షణం చెపాక్ స్టేడియం భావోద్వేగ సముద్రంగా మారిపోయింది. ధోని డ్రెస్సింగ్‌రూమ్ వైపు నడుస్తుండగా సీఎస్‌కే ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇవ్వడం అభిమానుల కళ్లను తడిపింది. కొద్దిసేపు స్టేడియంలో అలుముకున్న నిశ్శబ్దం.. ఒక యుగం ముగిసిందనే భావనను మరింత గాఢంగా మిగిల్చింది. ధోని ఆటను చూసి పెరిగిన తరం కోసం ఇది కేవలం ఓ వీడ్కోలు కాదు.. ఒక భావోద్వేగ అధ్యాయం ముగింపు. మ్యాచ్ ఆడకుండానే ఇంతటి స్పందన రావడం, అతని ప్రభావం ఎంత గొప్పదో చెప్పకనే చెబుతోంది. సోషల్ మీడియాలో ధోని ఫేర్‌వెల్ వీడియోలు వైరల్ అవుతుండగా, అభిమానులు "ఒక శకం ముగిసింది", "చెపాక్ ఇక మునుపటిలా ఉండదు" అంటూ భావోద్వేగ పోస్టులు చేస్తున్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా నిలిచిన ధోని మొత్తం 278 మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు చేశాడు. ఇందులో 24 అర్ధసెంచరీలు ఉన్నాయి. వికెట్‌కీపర్‌గా, ఫినిషర్‌గా, కెప్టెన్‌గా ధోని సృష్టించిన ప్రభావం తరాల పాటు గుర్తుండిపోనుంది. గెలుపు, ఓటములకు అతీతంగా.. ప్రశాంతత, నాయకత్వం, నమ్మకం అనే మూడు పదాలకు ప్రతిరూపంగా నిలిచిన ధోని ఇప్పుడు మైదానం నుంచి నెమ్మదిగా తప్పుకుంటున్నాడు. కానీ క్రికెట్ అభిమానుల హృదయాల్లో "తలా" స్థానం మాత్రం ఎప్పటికీ చెరగదు.






# రైజర్స్.. ఘనంగా!

**ప్లేఆఫ్స్‌కు హైదరాబాద్.. పాయింట్ల పట్టికలో నం.3.. చెపాక్‌లో సీఎస్కేకు షాక్**

**ఇషాన్, క్లాసెన్ అద్భుత ఇన్నింగ్స్.. గుజరాత్ కూడా ప్లేఆఫ్స్‌కు**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత ప్రదర్శనతో ప్లేఆఫ్స్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకుంది. సోమవారం నాడు చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్‌ల అద్భుత బ్యాటింగ్‌తో ఆరెంజ్ ఆర్మీ మరో ఓవర్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ ఓటమితో చెన్నై ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. మరోవైపు, నేటి మ్యాచ్ ఫలితంతో గుజరాత్ టైటాన్స్ కూడా ప్లేఆఫ్ బెర్తును ఖరారు చేసుకోవడం విశేషం. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ట్రావిస్ హెడ్ (6), అభిషేక్ శర్మ (26) త్వరగా వెనుదిరిగారు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) భారీ షాట్లతో చెలరేగారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 75 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను చెన్నై నుంచి లాగేసుకున్నారు. చివర్లో నితీశ్ రెడ్డి (11), సలీల్ అరోరా (10) తమ వంతు పరుగులు చేయడంతో సన్‌రైజర్స్ 19 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. అంతకుముందు, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. డెవాల్డ్ బ్రెవిస్ (27 బంతుల్లో 44), కార్తీక్ శర్మ (19 బంతుల్లో 32) రాణించగా, ఆరంభంలో సంజూ శాంసన్ (13 బంతుల్లో 27) మెరుపులు మెరిపించాడు. అయితే, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 3 వికెట్లు) తన అద్భుత బౌలింగ్‌తో చెన్నైని కట్టడి చేశాడు. అతనికి షకీబ్ హుస్సేన్ (2 వికెట్లు) చక్కటి సహకారం అందించాడు. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 13 మ్యాచ్‌ల్లో 8 విజయాలు సాధించి, 16 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. తద్వారా ప్లే ఆఫ్ బెర్తును ఖాయం చేసుకుంది. అదే సమయంలో, 13 మ్యాచ్‌లలో 8 విజయాలతో ఉన్న గుజరాత్ టైటాన్స్ బెర్తు కూడా ఖరారైంది. మరోవైపు, ఈ ఓటమితో చెన్నై ప్రయాణం కష్టాల్లో పడింది. 13 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో 12 పాయింట్లు మాత్రమే సాధించి ఆరో స్థానంలో నిలిచింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలవడంతో పాటు, పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన క్లిష్ట పరిస్థితిలో సీఎస్కే చిక్కుకుంది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 13 | 9 | 4 | 18 |
| గుజరాత్ | 13 | 8 | 5 | 16 |
| హైదరాబాద్ | 13 | 8 | 5 | 16 |
| పంజాబ్ | 13 | 6 | 6 | 13 |
| రాజస్థాన్ | 12 | 6 | 6 | 12 |
| చెన్నై | 13 | 6 | 7 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | 12 |
| కోల్‌కతా | 12 | 5 | 6 | 11 |
| ముంబై | 12 | 4 | 8 | 8 |
| లక్నో | 12 | 4 | 8 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

## చరిత్ర సృష్టించిన పాట్ కమిన్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలోనే కెప్టెన్‌గా అత్యధిక వికెట్లు తీసిన తొలి పేసర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా రికార్డ్‌ను కమిన్స్ అధిగమించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో పాట్ కమిన్స్(3/28) మూడు వికెట్లతో సత్తా చాటాడు. తద్వారా సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా 36 మ్యాచ్‌ల్లో 42 వికెట్లు పడగొట్టాడు. గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా 68 మ్యాచ్‌ల్లో 40 వికెట్లు తీయగా.. అతన్ని తాజా మ్యాచ్‌తో కమిన్స్ అధిగమించాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా దివంగత క్రికెటర్, రాజస్థాన్ రాయల్స్ మాజీ కెప్టెన్ షేన్ వార్న్ అగ్రస్థానంలో ఉన్నారు. స్పిన్నర్ అయిన షేన్ వార్న్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా 55 మ్యాచ్‌ల్లో 58 వికెట్లు తీసారు. ఆర్‌సీబీ కెప్టెన్ అనిల్ కుంబ్లే 26 మ్యాచ్‌ల్లో 30 వికెట్లు తీయగా.. కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సారథిగా అశ్విన్ 28 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు పడగొట్టాడు. అంతేకాకుండా కెప్టెన్‌గా ఐపీఎల్‌లో అత్యధిక సార్లు మూడు వికెట్ల ఘనతను అందుకున్న బౌలర్‌గానూ కమిన్స్ నిలిచాడు.

## బీసీసీఐ సర్కారీ సంస్థ కాదు

**కేంద్ర సమాచార కమిషన్ కీలక తీర్పు.. ఆర్టీఐ పరిధిలోకి రాదని స్పష్టీకరణ**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పరిధిలోకి రాదని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) కీలక తీర్పు వెలువరించింది. బీసీసీఐ చట్టప్రకారం ఏర్పాటైన సంస్థ కాదని, ప్రభుత్వం నుంచి గణనీయమైన నిధులు పొందడం లేదని, ప్రభుత్వ నియంత్రణలో కూడా లేదని స్పష్టం చేసింది. అందువల్ల ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 2(హ్) ప్రకారం దీనిని 'ప్రభుత్వ యంత్రాంగం'గా పరిగణించలేమని తేల్చిచెప్పింది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడానికి, జట్టును ఎంపిక చేయడానికి బీసీసీఐకి ఉన్న అధికారం గురించి గీతా రాణి అనే మహిళ 2017లో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు ఆర్టీఐ దరఖాస్తు చేశారు. దీనిపై మంత్రిత్వ శాఖ తమ వద్ద సమాచారం లేదని, బీసీసీఐని ప్రభుత్వ యంత్రాంగంగా ప్రకటించనందున ఈ దరఖాస్తును బదిలీ చేయలేమని బదులిచ్చింది. దీంతో ఆమె సీఐసీని ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై సోమవారం విచారణ జరిపిన సమాచార కమిషనర్ పి.ఆర్. రమేశ్, గీతా రాణి పిటిషన్‌ను కొట్టివేశారు. విచారణ సందర్భంగా బీసీసీఐ తమ వాదనలు వినిపించింది. తాము తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక ప్రైవేట్ స్వయంప్రతిపత్తి గల సంస్థ మాత్రమేనని, ప్రభుత్వ నియంత్రణ, యాజమాన్యం లేదా నిధులపై ఆధారపడలేదని వివరించింది. ఈ వాదనలతో ఏకీభవించిన సీఐసీ, బీసీసీఐ సొంతంగా మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టిక్కెట్ల అమ్మకాల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటూ ఆర్థికంగా స్వతంత్రంగా ఉందని పేర్కొంది. గతంలో లోధా కమిటీ సంస్కరణల విషయంలో సుప్రీంకోర్టు బీసీసీఐని 'ప్రజా ప్రాముఖ్యత' ఉన్న సంస్థగా గుర్తించినప్పటికీ, ఆర్టీఐ చట్టం ప్రకారం దానిని 'ప్రభుత్వ యంత్రాంగం'గా ప్రకటించలేదని సీఐసీ గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో, గీతా రాణి దాఖలు చేసిన అప్పీల్‌లో పసలేదని పేర్కొంటూ కమిషన్ దానిని కొట్టివేసింది.

## దిగ్గజ క్రికెటర్ మైక్ స్మిత్ కన్నుమూత




ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్, మాజీ టెస్టు కెప్టెన్ మైక్ స్మిత్ (92) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మైక్ స్మిత్ (ఎంజేకే స్మిత్) ఇంట్లోనే తుదిశ్వాస విడిచినట్లు వార్విక్‌షైర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇంగ్లండ్ మేటి బ్యాటర్‌గా గుర్తింపు పొందిన మైక్‌స్మిత్ 50 టెస్టులు ఆడాడు. ఇందులో 25 టెస్టులకు ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 1958లో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మైక్ స్మిత్ 1972లో ఆస్ట్రేలియాతో చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు. 50 మ్యాచ్‌ల్లో 2,278 పరుగులు చేసిన మైక్ స్మిత్ మూడు సెంచరీలు సాధించాడు. ఇక ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 637 మ్యాచ్‌లాడి 40వేలకు పైగా పరుగులు సాధించిన మైక్ స్మిత్ 72 సెంచరీలు బాదాడు. అంతేకాదు 1991 నుంచి 2003 మధ్య వార్విక్‌షైర్ కౌంటీ బోర్డు చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన పదవిలో ఉన్న సమయంలోనే వార్విక్‌షైర్ కౌంటీల్లో చాలా టైటిల్స్ సాధించింది. మైక్ స్మిత్ కుమారుడు నీల్ స్మిత్ అప్పటి జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. క్రికెటర్‌గానే గాక రగ్బీ ప్లేయర్‌గానూ మైక్ స్మిత్ గుర్తింపు పొందాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# పసిడి వ్యామోహానికి బ్రేక్

భారతీయులకు బంగారం కేవలం ఒక లోహం కాదు, అది ఒక సెంటిమెంట్, సామాజిక హోదాకు ప్రతిరూపం. కానీ ప్రస్తుత క్లిష్ట ఆర్థిక పరిస్థితుల్లో ఆ సెంటిమెంట్‌ను పక్కనబెట్టి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల భగ్గుమంటున్న వేళ, దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి పౌరులంతా తమ పసిడి వ్యామోహాన్ని తాత్కాలికంగా నియంత్రించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రజలు కనీసం ఒక ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నిలిపివేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తి దేశవ్యాప్తంగా ఒక సరికొత్త చర్చకు తెరలేపింది. భారతదేశం తన దేశీయ అవసరాలకు సరిపడా బంగారాన్ని ఉత్పత్తి చేయడం లేదు. మనం వినియోగించే బంగారంలో అత్యధిక భాగం విదేశాల నుంచే దిగుమతి అవుతోంది. ఈ దిగుమతులకు మనం అంతర్జాతీయ కరెన్సీ అయిన అమెరికన్ డాలర్లలో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2025-26) భారత్ ఏకంగా $72 బిలియన్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. మనం ఎంత ఎక్కువగా బంగారం కొంటే, అంతగా మన దేశంలోని డాలర్లు విదేశాలకు తరలిపోతాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగి, భారత రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది. రూపాయి బలహీనపడితే చమురు, నిత్యావసరాల దిగుమతి భారం పెరిగి దేశంలో ద్రవ్యోల్బణం తీవ్రమవుతుంది. కాబట్టి, బంగారం కొనకపోవడం అంటే నేరుగా రూపాయిని బలోపేతం చేయడమే. భారతదేశానికి ముడి చమురు (పెట్రోలియం) అత్యంత కీలకమైన దిగుమతి వస్తువు. దేశ ప్రగతి చక్రం తిరగాలంటే చమురు దిగుమతులు తప్పనిసరి. కానీ బంగారం అటువంటి అత్యవసర వస్తువు కాదు. అంతర్జాతీయ సంక్షోభాల వల్ల చమురు బిల్లు ఇప్పటికే భారంగా మారిన తరుణంలో, అదనంగా బంగారం దిగుమతుల వల్ల దేశ వాణిజ్య లోటు, కరెంట్ అకౌంట్ లోటు ప్రమాదకర స్థాయికి చేరుకుంటాయి. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, భారతీయులు ఒక ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు ఆపేస్తే సుమారు $72 బిలియన్ల విదేశీ మారకం ఆదా అవుతుంది. ఈ నిల్వలను దేశానికి అవసరమైన సాంకేతికత, మౌలిక వసతులు,, చమురు దిగుమతుల కోసం సురక్షితంగా వాడుకోవచ్చు. కేవలం దేశ ఆర్థిక వ్యవస్థ కోణంలోనే కాదు, వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికల పరంగా చూసినా ప్రస్తుతం భౌతిక బంగారం కొనడం అంత తెలివైన నిర్ణయం కాదు. ప్రస్తుతం పసిడి ధరలు రికార్డు స్థాయి గరిష్టాల వద్ద ఉన్నాయి. ఇటువంటి ఊహాజనిత మార్కెట్ గరిష్టాల్లో ఉన్నప్పుడు కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో మార్కెట్ సరిదిద్దబడినప్పుడు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. పైగా భౌతిక బంగారాన్ని ఆభరణాల రూపంలో కొనేటప్పుడు 3% జీఎస్టీ, తరుగు, మజూరీల రూపంలో 10% నుండి 20% వరకు డబ్బు వృధా అవుతుంది. తిరిగి అమ్మేటప్పుడు ఈ అదనపు ఛార్జీలు రావు సదా నష్టమే మిగులుతుంది. బంగారం కొనకపోవడమే మంచిది అంటే పెట్టుబడులు పెట్టడం ఆపాలని కాదు. సంప్రదాయ పసిడి నగల కంటే మెరుగైన రాబడులు ఇచ్చే ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలు పరిశీలించాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ మార్కెట్లు, లేదా ప్రభుత్వ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెట్టడం వల్ల వ్యక్తిగత సంపద పెరగడంతో పాటు దేశీయ పరిశ్రమలకు మూలధనం లభిస్తుంది. ఒకవేళ బంగారంలోనే పెట్టుబడి పెట్టాలనుకునే వారు భౌతిక బంగారానికి బదులుగా డిజిటల్ గోల్డ్ లేదా సావరిన్ గోల్డ్ బాండ్‌ల వైపు మొగ్గు చూపడం మంచిది. కష్టకాలంలో ఆదుకునే 'లిక్విడ్ అసెట్' గా బంగారానికి ఉన్న క్రెడిబిలిటీని ఎవరూ శంకించలేరు. కానీ దేశం ఒకవైపు అంతర్జాతీయ సంక్షోభాలెదుర్కొంటూ విదేశీ నిల్వలను కాపాడుకోవడానికి పోరాడుతున్నప్పుడు, పౌరులుగా మన బాధ్యతను చాటుకోవాలి. వివాహాలు, పండుగల పేరుతో అప్పులు చేసైనా సరే బంగారం కొనాలనే పాత ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్వల్పకాలికంగా బంగారం కొనుగోళ్లను వాయిదా వేయడం వల్ల జువెలరీ రంగంలో తాత్కాలిక ఉపాధి సమస్యలు తలెత్తవచ్చనే ఆందోళన ఉన్నప్పటికీ, దీర్ఘకాలిక దేశ హితం ముందు ఇది చిన్న విషయమే. పసిడి వ్యామోహాన్ని కట్టిపెట్టి దేశ కరెన్సీని, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడమే నేటి తక్షణ కర్తవ్యం.

# ఇంధన మోత.. ధరల మేత

**భారత ఆర్థిక వ్యవస్థలో 2026 ఏప్రిల్ నెల కీలక మలుపుగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, ఇంధన వ్యయాలు విపరీతంగా అధికమవడం, పారిశ్రామిక ముడిసరుకుల ధరలు పెరగడం వంటి కారణాలతో దేశ టోకు ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 8.3 శాతానికి ఎగసింది. పరిశ్రమల ప్రోత్సాహక మరియు అంతర్గత వాణిజ్య విభాగం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, మార్చిలో 3.88 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో రెట్టింపు కంటే ఎక్కువగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఫిబ్రవరిలో ఇది 2.26 శాతంగా నమోదైంది.**



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

టోకు ధరల సూచీ కూడా మార్చిలో 160.8 నుంచి ఏప్రిల్‌లో 167.0కి పెరిగింది. అంటే నెలవారీగా దాదాపు 3.86 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల ఉత్పత్తి రంగాలపై వ్యయ ఒత్తిళ్లు తీవ్రమవుతున్నాయని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా ఖనిజ నూనెలు, ముడి పెట్రోలియం, సహజ వాయువు, రసాయనాలు, ప్రాథమిక లోహాలు, తయారీ ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడం ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఇంధనం, విద్యుత్ విభాగాల్లో నమోదైన ద్రవ్యోల్బణం అత్యంత ఆందోళనకరంగా మారింది. మార్చిలో 1.05 శాతంగా ఉన్న ఈ విభాగ ద్రవ్యోల్బణం ఏప్రిల్ నాటికి 24.71 శాతానికి పెరిగింది. ముఖ్యంగా ముడి చమురు, సహజ వాయువు ధరలు పెరగడం దేశ పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముడి పెట్రోలియం మరియు సహజ వాయువు ద్రవ్యోల్బణం 67.18 శాతానికి చేరుకోగా, ఒక్క ముడి చమురు ధరే గతేడాదితో పోలిస్తే 88.06 శాతం పెరిగింది. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల దేశీయ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతోంది. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెరుగుదల రవాణా నుంచి వ్యవసాయం వరకు అన్ని రంగాల ఖర్చులను పెంచుతోంది.

ప్రాథమిక సరుకుల విభాగంలో కూడా ద్రవ్యోల్బణం పెరుగుదల స్పష్టంగా కనిపించింది. ఆహార పదార్థాలు, ఖనిజాలు, ఆహారేతర వస్తువులను కలిగి ఉన్న ఈ విభాగంలో ఏప్రిల్ నెలలో 9.17 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. ఫ్రా× ఫుడ్ ఇండెక్స్ మార్చిలో 1.85 శాతంగా ఉండగా, ఏప్రిల్‌లో 2.31 శాతానికి పెరిగింది. కూరగాయలు, పండ్లు, గుడ్లు, మాంసం, చేపల ధరలు పెరగడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతోంది. అయితే పప్పుధాన్యాలు, ఉల్లిపాయల ధరలు తగ్గడం కొంత ఉపశమనం కలిగించింది. అయినప్పటికీ ఆహార వ్యయాలపై ఒత్తిడి కొనసాగుతోంది. టోకు ధరల సూచీలో అత్యధిక వాటా కలిగిన తయారీ రంగం కూడా ఈ ఒత్తిడిని తీవ్రంగా ఎదుర్కొంటోంది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.62 శాతానికి పెరిగింది. ఇనుము, ఉక్కు, అల్యూమినియం, రసాయనాలు, వస్త్రాలు, యంత్రాలు, ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం ఇందుకు కారణమయ్యాయి. ముడిసరుకు వ్యయాలు పెరగడంతో పరిశ్రమల ఉత్పత్తి ఖర్చులు అధికమవుతున్నాయి. పెద్ద సంస్థలు కొంతవరకు దీనిని తట్టుకోగలిగినా, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్ల వస్తువుల ధరలు పెరగాల్సి వస్తోంది. దీని వల్ల వినియోగం తగ్గి, మార్కెట్లో డిమాండ్ మందగించే ప్రమాదం ఉంది.

ఇంధన ధరల పెరుగుదలతో రవాణా రంగం అత్యంత ప్రభావితమైంది. ట్రక్కులు, బస్సులు, సరుకు రవాణా వాహనాల నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి. దీని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై నేరుగా పడుతోంది. రైతు పొలం నుంచి మార్కెట్‌కు చేరే వరకు ప్రతి దశలో రవాణా వ్యయం పెరగడంతో వినియోగదారుడు అధిక ధర చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. చిన్న వ్యాపారులు ధరల మార్పులను తట్టుకోలేక నష్టాలను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగం కూడా ఈ పరిస్థితితో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఎరువులు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ ఖర్చులు పెరగడంతో సాగు వ్యయం గణనీయంగా పెరిగింది. ట్రాక్టర్లు, పంపుసెట్లు, కోత యంత్రాల నిర్వహణ ఖర్చులు పెరగడంతో రైతుల పెట్టుబడి సామర్థ్యం తగ్గుతోంది. పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో లేకపోతే రైతులు అప్పుల పాలయ్యే ప్రమాదం పెరుగుతోంది. మద్దతు ధరలు పెంచినా, మార్కెట్లో పెరుగుతున్న వ్యయాలను పూర్తిగా భర్తీ చేయలేకపోతున్నాయి. ఫలితంగా వ్యవసాయ రంగంలో ఆర్థిక అసమతుల్యత పెరుగుతోంది.

ద్రవ్యోల్బణం ప్రభావం సాధారణ ప్రజల జీవన వ్యయంపై స్పష్టంగా కనిపిస్తోంది. గ్యాస్ సిలిండర్ ధరలు, విద్యుత్ బిల్లులు, కూరగాయల ధరలు, పాఠశాల రవాణా ఖర్చులు, వైద్య సేవల వ్యయాలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ దెబ్బతింటోంది. జీతాలు స్థిరంగా ఉన్నప్పటికీ ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయి. వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గడంతో మార్కెట్లో వినియోగ వ్యయం కూడా తగ్గే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పెన్షనర్లు, స్థిర ఆదాయం కలిగిన ఉద్యోగులు అధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుదల భారతీయ రిజర్వ్ బ్యాంక్‌కు కూడా పెద్ద సవాలుగా మారింది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు వడ్డీ రేట్లు పెంచాల్సి వస్తే రుణాల ఈఎంఐలు అధికమవుతాయి. గృహ, వాహన, వ్యాపార రుణాలపై భారం పెరిగి వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. మరోవైపు వడ్డీ రేట్లు పెంచకుండా ఉంటే ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉంది. కాబట్టి ఆర్థిక వృద్ధి మరియు ద్రవ్యోల్బణ నియంత్రణ మధ్య సమతుల్యతను కాపాడటం ఆర్బీఐకి పెద్ద సవాలుగా మారింది. ద్రవ్యోల్బణం పెరగడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వ్యయం కూడా పెరుగుతోంది. ఆహార భద్రత, ఎరువుల సబ్సిడీలు, ఇంధన సబ్సిడీలు, ఉపాధి హామీ పథకాల నిర్వహణ ఖర్చులు అధికమవుతున్నాయి. దీని వల్ల ప్రభుత్వ ఆర్థిక లోటు పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వ వ్యయాలు పెరిగితే అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించే నిధులు తగ్గే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల రంగాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉంది.

వడ్డీ రేట్లు పెరిగితే రుణాల వసూళ్లు మందగించే ప్రమాదం ఉంది. వ్యాపార సంస్థలు కొత్త పెట్టుబడులకు వెనుకాడవచ్చు. చిన్న వ్యాపారులు వ్యాపార విస్తరణను నిలిపివేయవచ్చు. దీని ప్రభావం ఉపాధి అవకాశాలపై పడే అవకాశం ఉంది. తయారీ రంగం మందగిస్తే కొత్త నియామకాలు తగ్గిపోతాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రజల ఆదాయం ప్రధానంగా వ్యవసాయం, కూలి పనులపైనే ఆధారపడి ఉంటుంది. కానీ వస్తువుల ధరలు పెరిగినా వారి ఆదాయం అదే స్థాయిలో పెరగడం లేదు. దీంతో గ్రామీణ కొనుగోలు శక్తి తగ్గుతోంది. చిన్న దుకాణాలు, స్థానిక వ్యాపారులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ మార్కెట్లలో వ్యాపార చలనం మందగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, సరఫరా గొలుసుల అంతరాయాలు, చమురు ఉత్పత్తి దేశాల విధానాలు, అంతర్జాతీయ వాణిజ్య అస్థిరత ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా, యూరప్ దేశాల్లో కూడా ద్రవ్యోల్బణ ఒత్తిడులు కొనసాగుతున్నాయి. ఈ ప్రభావం భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఎక్కువగా పడుతోంది. ప్రపంచ మార్కెట్‌లో ముడిసరుకు ధరలు పెరగడం వల్ల దిగుమతి వ్యయాలు అధికమవుతున్నాయి.

ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం తక్షణ ఉపశమన చర్యలతో పాటు దీర్ఘకాలిక వ్యూహాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. దేశీయ ఇంధన ఉత్పత్తిని పెంచడం, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడం, సౌరశక్తి, గాలి విద్యుత్ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం. రవాణా వ్యవస్థను ఆధునీకరించడం ద్వారా సరుకు రవాణా ఖర్చులను తగ్గించవచ్చు. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించవచ్చు. వ్యవసాయ రంగంలో నిల్వ సదుపాయాలు, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థలు, మార్కెట్ మద్దతు, డిజిటల్ మార్కెట్ వ్యవస్థలను బలోపేతం చేస్తే ఆహార ధరల అస్థిరతను తగ్గించవచ్చు. రైతులకు నేరుగా మార్కెట్ యాక్సెస్ కల్పిస్తే గ్రామీణ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. 2026 ఏప్రిల్‌లో నమోదైన 8.3 శాతం టోకు ద్రవ్యోల్బణం భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్లిష్ట పరిస్థితులకు హెచ్చరిక సంకేతంగా మారింది. ఇంధన ధరల పెరుగుదల, ముడిసరుకు వ్యయాల అధికత, తయారీ రంగంపై ఒత్తిడి, రవాణా ఖర్చుల పెరుగుదల కలిసి దేశ ఆర్థిక వ్యవస్థపై బహుముఖ ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ పరిస్థితి కేవలం పరిశ్రమలకే కాకుండా సాధారణ ప్రజల జీవన ప్రమాణాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్, పరిశ్రమలు, వ్యవసాయ రంగం సమన్వయంతో పనిచేస్తేనే ఈ ద్రవ్యోల్బణ ఒత్తిడిని తగ్గించడం సాధ్యమవుతుంది. ఇంధన రంగంలో స్వావలంబన, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, ప్రత్యామ్నాయ శక్తి వనరుల అభివృద్ధి, వ్యవసాయ రంగ సంస్కరణలు, సమతుల్య ద్రవ్య విధానాలు అమలైతే మాత్రమే భారతదేశం దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని సాధించగలదు.




రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.